1St Year
Happy Work Anniversary.

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
RNI : APTEL / 2023 / 89152
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
THE POWER OF RK PEN

సంపుటి : 3 సంచిక : 53 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ సోమవారం 23 ఫిబ్రవరి 2026 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు,నెల్లూరు
VOLUME : 03 ISSUE : 53 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE,NELLORE Monday 23 February 2026 PAGES : 8 PRICE : 3/-

## సుప్రీం తీర్పు ఎఫెక్ట్.. భారత్-అమెరికా చర్చలు రీషెడ్యూల్..



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఫిబ్రవరి 22)

భారత్-అమెరికా మధ్య మధ్యంతర వాణిజ్య ఒప్పందం ఖరారైన సంగతి తెలిసిందే. ఈ డీల్‌కు చట్టబద్ధంగా తుదిరూపును ఖరారు చేసేందుకు సోమవారం జరగాల్సిన చర్చలు వాయిదా పడ్డట్లు సమాచారం. వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరిపేందుకు ఫిబ్రవరి 23 నుంచి 3 రోజుల పాటు వాషింగ్టన్‌లో ఇరుదేశాల ప్రతినిధులు సమావేశం కావాల్సి ఉంది. కాగా ప్రపంచ దేశాలపై ట్రంప్ విధించిన సుంకాలు చెల్లవంటూ అమెరికా సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు నేపథ్యంలోనే ఈ చర్చలను రీషెడ్యూల్ చేసినట్లు తెలుస్తోంది. ఇరు దేశాలకు అనుకూలమైన తేదీలలో ఈ చర్చలను తిరిగి నిర్వహించనున్నట్లు విదేశాంగ శాఖ వర్గాలు తెలిపాయి. ఈ ప్రకటనను కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది. ప్రపంచ దేశాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన టారిఫ్‌లను అక్కడి సుప్రీంకోర్టు ఇటీవల రద్దు చేసింది. టారిఫ్‌లు చెల్లవంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తంచేశారు. తీర్పు వచ్చిన కొన్ని గంటల్లోనే ప్రపంచ దేశాలపై 10శాతం సుంకాలు విధించిన ఆయన.. తాజాగా వాటిని 15శాతానికి పెంచుతున్నట్లు ప్రకటించారు. ఇవి తక్షణమే అమల్లోకి వస్తాయని స్పష్టం చేశారు. మున్ముందూ చట్టబద్ధమైన టారిఫ్‌లను జారీ చేస్తామన్నారు. ఈ నేపథ్యంలో అగ్రరాజ్యంతో భారత్ చేసుకొన్న ట్రేడ్ డీల్ లో మార్పులు జరిగే అవకాశం ఉంది.

## ఏఐ సమిట్‌లోనూ కాంగ్రెస్ మురికి రాజకీయాలు: ప్రధాని మోదీ





(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, ఫిబ్రవరి 22)

దిల్లీలో నిర్వహించిన ఏఐ సమిట్‌లో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు అర్ధనగ్నంగా నిరసన చేపట్టడాన్ని ప్రధాని మోదీ తీవ్రంగా ఖండించారు. గ్లోబల్ ఈవెంట్ ▶మిగతా 2లో

## మన టెక్నాలజీ చూసి ప్రపంచ దేశాలు ఆశ్చర్యపోయాయి



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఫిబ్రవరి 22)

భారత ప్రభుత్వం విజయవంతంగా నిర్వహించిన ఏఐ సమిట్ ప్రపంచ దేశాలను ఆకర్షించిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఏఐ సమిట్‌లో ముఖ్యంగా రెండు భారత ఆవిష్కరణలు ప్రపంచ నేతలను ఆశ్చర్యపరిచాయని పేర్కొన్నారు. జంతువుల చికిత్సకు.. వాటిని ట్రాక్ చేయడానికి ఏఐను వినియోగించడం, భారత పురాతన గ్రంథాలు, జ్ఞానాన్ని సంరక్షించడానికి ▶మిగతా 2లో

# జగన్‌కు లోకేశ్ ఘాటు కౌంటర్.. మీది కపట ప్రేమ అంటూ ఫైర్

- పెట్టుబడుల వాతావరణాన్ని దెబ్బతీసింది జగనేనన్న లోకేశ్
- గతంలో జగన్ తీసుకున్న నిర్ణయాలను ఏకరువు పెట్టిన లోకేశ్
- కపట ప్రేమతో ఇప్పుడు నీతులు చెబుతున్నారంటూ తీవ్ర విమర్శ



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 22)

ఢిల్లీలో జరిగిన ఇండియా ఏఐ సమ్మిట్‌లో యూత్ కాంగ్రెస్ నిరసనపై వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ గట్టి కౌంటర్ ఇచ్చారు. పెట్టుబడుల వాతావరణాన్ని దెబ్బతీసిన జగన్ ఇప్పుడు దేశ ప్రతిష్ఠ గురించి మాట్లాడటం కపట ప్రేమను ప్రదర్శించడమేనని లోకేశ్ తీవ్రంగా విమర్శించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదిక ఎక్స్ లో పోస్టు పెట్టారు. ఢిల్లీ ఏఐ సదస్సులో జరిగిన నిరసన దేశానికి తలవంపులు తెచ్చిందని, రాజకీయ విబేధాలున్నా ప్రపంచ వేదికపై దేశ గౌరవాన్ని కించపరచవద్దని జగన్ వ్యాఖ్యానించారు. దీనిపై స్పందించిన లోకేశ్, జగన్ గతాన్ని గుర్తు చేస్తూ పలు ఆరోపణలు చేశారు. 'భారత్‌లో పెట్టుబడుల వాతావరణానికి అందరికంటే ఎక్కువ నష్టం కలిగించిన వ్యక్తి, ఇప్పుడు నకిలీ సానుభూతి ప్రదర్శిస్తున్నారు. ఈ కపటత్వం ▶మిగతా 2లో

## గ్రామీణ డాక్ సేవక్‌లు అద్భుతాలు చేయగలరు సీఎం చంద్రబాబు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 22)

వికసిత్ భారత్ సాధనలో గ్రామీణ డాక్ సేవక్‌లు ముందుండాలని సీఎం చంద్రబాబు అన్నారు. ఏ పని కావాలన్నా వాట్సప్ గవర్నెన్స్ ద్వారా అందిస్తున్నామని, పార్శిల్ పంపిణీలో గ్రామీణ డాక్ సేవక్‌లను వినియోగించుకుంటామని అన్నారు. సరైన దారి చూపిస్తే వారు అద్భుతాలు చేస్తారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో గుంటూరులోని సత్యసాయి ఆధ్యాత్మిక సిటీలో 'గ్రామీణ డాక్ సేవక్' సమ్మేళనం నిర్వహించారు. ఉత్తమ గ్రామీణ డాక్ సేవక్‌లకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, జోతిరాదిత్య సింధియా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. కేంద్రం, రాష్ట్రం చేసే మంచి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ▶మిగతా 2లో

## పవన్‌కల్యాణ్ దత్తత గ్రామం కొణిదెలకు కొత్తదశ

**రూ.50 లక్షల విరాళంతో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం**

**వివిధ పథకాల కింద రూ.6 కోట్లతో అభివృద్ధి పనులు**

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 22)

ఈనాడు, అమరావతి: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చొరవతో నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం కొణిదెల గ్రామంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. పవన్‌కల్యాణ్ ఇంటి పేరు, ఆ ఊరి



పేరు ఒకటే కావడం విశేషం. 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో ఆయన కర్నూలు జిల్లా పర్యటనలో ఉండగా కొణిదెల గ్రామస్థులు కొందరు తమ గ్రామాన్ని దత్తత తీసుకోవాలని కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. కిందటేడాది నందికొట్కూరు నియోజకవర్గ పర్యటనకు వెళ్లి కొణిదెల అభివృద్ధికి రూ.50 లక్షల విరాళం అందించారు. జిల్లా యంత్రాంగం సూచన మేరకు ఆ నిధులతో 90 వేల లీటర్ల సామర్థ్యం ▶మిగతా 2లో

## ట్రంప్ మాస్టర్ ప్లాన్: ఖమేనీ, ఆయన కుమారుడిని అంతం చేసేలా వ్యూహం!

- ఇరాన్ సుప్రీం లీడర్‌ను లక్ష్యంగా చేసుకున్న అమెరికా
- మధ్యప్రాచ్యంలో భారీగా అమెరికా సైనికుల మోహరింపు
- చర్చలకు సిద్ధం.. యుద్ధానికీ సై అంటున్న ఇరాన్
- పరిమిత దాడుల ఆలోచనలో ఉన్నానన్న డొనాల్డ్ ట్రంప్
- పూర్తిస్థాయి యుద్ధానికి దారితీయొచ్చని నిపుణుల హెచ్చరిక




(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఫిబ్రవరి 22)

అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రస్థాయికి చేరుకుంటున్నాయి. ఇరాన్ అణు కేంద్రాలపైనే కాకుండా, ఏకంగా ఆ దేశ అత్యున్నత నాయకుడు అయతుల్లా అలీ ఖమేనీ, ఆయన వారసుడిగా భావిస్తున్న కుమారుడు మొజ్తాబా ఖమేనీలను లక్ష్యంగా చేసుకునే సైనిక ప్రణాళికలను అమెరికా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ప్రముఖ వార్తా సంస్థ 'ఆక్సియోస్' ఒక కథనాన్ని ▶మిగతా 2లో

## శ్రీవారి ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు జగన్ కుట్ర నిమ్మల



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 22)

శ్రీవారి ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు జగన్ కుట్ర పన్నారని మంత్రి నిమ్మల రామానాయుడు ఆక్షేపించారు. రసాయనాల మిశ్రమంతో లడ్డూలు తయారు చేశారని మండిపడ్డారు. శ్రీవారి పటాలను ప్లకార్డుల రూపంలో మండలిలో ప్రదర్శించడం దారుణమన్నారు. ప్రసాదాల్లో కుంభకోణానికి పాల్పడిన వైకాపాకి తిరుమలపై మాట్లాడే అర్హత లేదన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో రూ.4.43 కోట్ల విలువైన పనులకు నిమ్మల శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇందాపూర్ డెయిరీకి హెరిటేజ్ కొనుగోలుదారే కానీ, సరఫరాదారు కాదన్నారు.

## బీజేపీకి కొత్త అర్థం చెప్పిన షర్మిల... చంద్రబాబు, జగన్ పై తీవ్ర విమర్శలు

- చంద్రబాబు, జగన్‌లు బీజేపీకి బానిసలుగా మారారని షర్మిల విమర్శ
- మోదీ చైనా రోబోను ప్రదర్శించినప్పుడు వీరి నోళ్లు పెగల్లేదని ఎద్దేవా
- చంద్రబాబుది అధికారిక పొత్తు కాగా, జగన్‌ది బీజేపీతో అక్రమ పొత్తు అని ఆరోపణ



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 22)

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, సీఎం చంద్రబాబు, వైసీపీ అధినేత జగన్ లపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వారిద్దరూ ప్రధాని నరేంద్ర మోదీకి ప్రచారకర్తలుగా, బీజేపీ ఎదుట బానిసలుగా మారారని, స్వప్రయోజనాల కోసం దేశ ప్రయోజనాలను తాకట్టు పెట్టే తోలుబొమ్మలని ఆమె తీవ్రంగా విమర్శించారు. చంద్రబాబుది బీజేపీతో అధికారిక పొత్తు అయితే, జగన్‌ది అక్రమ పొత్తు అంటూ ట్వీట్ చేశారు. రాష్ట్రంలో బీజేపీ అంటే బాబు-జగన్-పవన్ అని, వీరంతా మోదీ కోసం పనిచేస్తున్నారని షర్మిల ఆరోపించారు. ఈ సందర్భంగా షర్మిల స్పందిస్తూ... "ఏఐ సదస్సు వేదికగా ప్రధాని మోదీ ఒక చైనా రోబో బొమ్మను ప్రదర్శించి ▶మిగతా 2లో

## హిందువుల మనోభావాలంటే వైకాపా వారికి లెక్కేలేదు: పల్లా శ్రీనివాసరావు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 22)

వైకాపా అధ్యక్షుడు జగన్, ఆ పార్టీ నేతలకు దేవుడంటే భయం, భక్తి లేవని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు విమర్శించారు. హిందువుల మనోభావాలంటే వారికి లెక్కేలేదన్నారు. విశాఖలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవదేవుడిని కూడా రాజకీయాలకు వాడుకునే స్థాయికి దిగజారారని ఆగ్రహం వ్యక్తం చేశారు. "జగన్ మార్గదర్శకత్వంలో శ్రీవారి ఫొటోలతో రాజకీయం చేసే నీచానికి దిగజారారు. దేవుడి ప్రసాదాన్ని జంతు కొవ్వు, ▶మిగతా 2లో

## అబుల్ కలాం ఆజాద్‌కి ఘన నివాళులు



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఫిబ్రవరి 22)

భారతదేశపు మొదటి విద్యాశాఖ మంత్రి, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, మహోన్నత విద్యావేత్త మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతి మండలంలోని ముస్లిం పేట నందు ఘణంగా నిర్వహించారు. ఇ సందర్భంగా అజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆధునిక విద్యా వ్యవస్థ నిర్మాణానికి, జాతీయ సమగ్రతకు ఆయన చేసిన కృషి గుర్తుచేసుకుంటూ ఆయన ఆశయాలు, సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో చిన్నగంజాం ముస్లిం ఎంఐఎం పార్టీ మండల అధ్యక్షుడు పఠాన్ సుభాన్ ఖాన్, షేక్ యూసుఫ్, షేక్ మౌలాలి, షేక్ సిద్ధిక్, షేక్ నాగూర్, పఠాన్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

## 117 మందికి రూ.75 లక్షల విలువ చేసే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ





(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, ఫిబ్రవరి 22)

యర్రగొండపాలెం నియోజకవర్గ చరిత్రలో మొదటిసారి 117 మందికి రూ.75 లక్షల విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో యర్రగొండపాలెం టిడిపి ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు ఒకే సారి అందించారు. వివిధ రకాలైన ఆరోగ్య సమస్యలతో ప్రవేటు వైద్యశాలలో చికిత్సలు పొందిన వీరు, ఎరిక్షన్ బాబు వద్దకు వెళ్ళి చికిత్సకు సంబంధించిన వివరాలు అందించి సహాయం కోరడంతో ఆయన వీరందరికీ సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందేలా చేసారు. ఈ క్రమంలో వచ్చిన చెక్కులను టిడిపి కార్యాలయంలో 117 మందికి అందించారు. దీంతో లబ్ధిదారులు చంద్రబాబుకి, ఎరిక్షన్ బాబుకి ధన్యవాదములు తెలిపారు. ఈ సమావేశంలో యర్రగొండపాలెం మార్కెట్ యార్డ్ చైర్మన్ చేకూరి సుబ్బారావు, మండల టీడీపీ అధ్యక్షులు చిట్యాల వెంగల్‌రెడ్డి, పోట్ల గోవిందు, షేక్ మాబు, మేకల వలరాజు యాదవ్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కామేపల్లి వెంకటేశ్వర్లు, సర్పంచ్ మంత్ర నాయక్, పాలడుగు వెంకట కోటయ్య, తదితరులు పాల్గొన్నారు.

**మొదటి పేజీ తరువాయి**

## జగన్‌కు లోకేశ్ ఘాటు కౌంటర్.. మీది కపట ప్రేమ అంటూ ఫైర్

ఆశ్చర్యం కలిగిస్తోంది' అని లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా జగన్ గతంలో తీసుకున్న పలు నిర్ణయాలను లోకేశ్ ఏకరువు పెట్టారు. 2017లో ఇన్వెస్ట్‌మెంట్ సదస్సును అడ్డుకునేందుకు విమానాశ్రయంలో ధర్నా చేశారు. 2019లో అంతర్జాతీయ పెట్టుబడిదారులతో కుదిరిన విద్యుత్ ఒప్పందాలను రద్దు చేశారు. 2020లో అమరావతిలో సింగపూర్ ప్రభుత్వం పెట్టాల్సిన పెట్టుబడులను అడ్డుకున్నారు. 2025లో ప్రభుత్వ నిధుల సమీకరణను నిలిపివేయాలని ఆర్‌బీఐకి లేఖ రాశారు. ఇప్పుడు 2026లో ఏఐ సదస్సు ఘటనపై ఆందోళన చెందుతున్నట్టు నటిస్తున్నారని లోకేశ్ విమర్శించారు.

## ఏఐ సమిట్‌లోనూ కాంగ్రెస్ మురికి రాజకీయాలు: ప్రధాని మోదీ

ఏఐ సమిట్‌ను కాంగ్రెస్ తన మురికి రాజకీయాలకు వేదికగా మార్చుకుందని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించారు. యూపీలోని మేరఠ్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఏఐ సమిట్‌లో విదేశీ అతిథులు కూర్చున్న వేదిక వద్దకు కాంగ్రెస్ నాయకులు అర్ధనగ్నంగా వచ్చి గందరగోళం సృష్టించారని తెలిపారు. తమ చర్యలతో కాంగ్రెస్ నేతలు ఇప్పటికే ప్రజల దృష్టిలో దిగజారారని.. ఇంకా ఇటువంటి పనులు చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. దేశాన్ని అప్రతిష్ఠపాలు చేసే పనిలో కాంగ్రెస్ తీరిక లేకుండా ఉందని విమర్శించారు. రాజకీయాలకు అతీతంగా జాతీయ ప్రయోజనాల కోసం చేపడుతున్న కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు ఈవిధంగా ప్రవర్తించడం సిగ్గుచేటని ప్రధాని విమర్శించారు. రాజకీయ విభేదాల కంటే వారు వ్యక్తిగత శత్రుత్వంపైనే దృష్టి పెడుతున్నారన్నారు. గతంలో తనను, తన తల్లిని అవమానించారని..ఇప్పుడు ప్రపంచ నేతల ఎదుట దేశాన్ని అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశాభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుంటే.. కాంగ్రెస్ నేతలు మాత్రం దేశపరువు తీయడానికి చూస్తున్నారని దుయ్యబట్టారు.

అసలేం జరిగింది..?

ఏఐ ఇంపాక్ట్ సమిట్‌ను లక్ష్యంగా చేసుకొని కాంగ్రెస్ యువజన విభాగమైన 'భారత యువజన కాంగ్రెస్ (ఐవైసీ)' కార్యకర్తలు నాటకీయ రీతిలో నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఎగ్జిబిషన్ హాలు నంబరు-5లోకి ప్రవేశించిన దాదాపు 15 మంది కార్యకర్తలు.. చొక్కాలు విప్పి ఆందోళన చేపట్టారు. ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేంద్రానికి, భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా నినాదాలు రాసి ఉన్న టీ-షర్ట్‌లు వారి చేతుల్లో కనిపించాయి. వారి చర్యల వల్ల కొంత సమయం పాటు సమావేశానికి అంతరాయం కలిగింది. అనంతరం భద్రతా సిబ్బంది వారిని కస్టడీలోకి తీసుకున్నారు.

## మన టెక్నాలజీ చూసి ప్రపంచ దేశాలు ఆశ్చర్యపోయాయి

ఏఐను ఉపయోగించడం చూసి ప్రపంచ నేతలు ప్రశంసించారని ప్రధాని అన్నారు. ఆదివారం 131వ 'మన్‌కీ బాత్' కార్యక్రమంలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు.

కృత్రిమ మేధస్సు, అంతరిక్ష పరిశోధన, సెమీకండక్టర్లు, గ్రీన్ ఎనర్జీ సహా అభివృద్ధి చెందుతోన్న సాంకేతిక పరిజ్ఞానాలను వినియోగిస్తూ భారత్ వేగవంతంగా అభివృద్ధి చెందుతోందని ప్రధాని అన్నారు. మన యువత తమ ఆవిష్కరణలతో దేశ కీర్తిని ఉన్నత శిఖరాలను తీసుకువెళ్లే శక్తిని కలిగి ఉందని ప్రశంసించారు. ఈ సదస్సు ద్వారా వివిధ దేశాల నేతలకు, టెక్ దిగ్గజాలకు మన యువత ప్రతిభను, నూతన ఆవిష్కరణలను స్వయంగా చూపించే అవకాశం లభించిందన్నారు. ప్రపంచ స్థాయి నాణ్యతను దృష్టిలో పెట్టుకొని వస్తువుల ఉత్పత్తి, సేవలు ఉండాలని దేశంలోని తయారీదారులు, స్టార్టప్‌లకు సూచించారు. అలాగే సైబర్ నేరాలపై ప్రధాని మోదీ హెచ్చరించారు. డిజిటల్ అరెస్టుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు.

**ఆ చిన్నారి నలుగురికి జీవనదాత**

ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కేరళకు చెందిన 10 నెలల చిన్నారి అలిన్ షెరిన్ ను ప్రధాని గుర్తు చేసుకున్నారు. బ్రెయిన్ డెడ్ అయిన తమ చిన్నారి అవయవాలను దానం చేయడానికి ముందుకు వచ్చిన ఆమె తల్లిదండ్రులను ప్రశంసించారు. బిడ్డను కోల్పోయిన బాధలోనూ వారు తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు. దీనివల్ల ఆ చిన్నారి నలుగురికి జీవనదాతగా మారిందన్నారు. ఇటువంటి ఘటనల వల్ల దేశంలో అవయవ దానంపై అవగాహన పెరగుతోందన్నారు.

## గ్రామీణ డాక్ సేవక్‌లు అద్భుతాలు చేయగలరు: సీఎం చంద్రబాబు

సూపర్ సిక్స్ పథకాల అమల్లో గ్రామీణ డాక్ సేవక్‌ల సేవలను కొనియాడారు.

**తపాలాశాఖకు ఎయిరిండియా పరిస్థితి రాకూడదు: పెమ్మసాని**

పోస్టల్ శాఖలో ఏపీని అగ్రస్థానంలో నిలిపినట్లు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. తపాలా వ్యవస్థ మూలాలు మన మట్టిలోనే ఉన్నాయన్నారు. బ్రిటిషర్లు రాకముందే మనకు వివిధ రూపాల్లో తపాలా వ్యవస్థ ఉందని చెప్పారు. " ఆధునిక సాంకేతికత ద్వారా తపాలా సేవలు తగ్గిపోయాయి. దేశంలో తపాలాశాఖకు రూ.35వేల కోట్లు ఖర్చు అవుతోంది. కానీ, ఏటా రూ.13వేల కోట్లే ఆదాయం ఉంది. రైల్వే తర్వాత ఎక్కువ మంది ఉద్యోగులు ఉన్న సంస్థ తపాలా శాఖ. తపాలాశాఖకు ఎయిరిండియా పరిస్థితి రాకూడదు. లోటును లాభంగా మార్చాలి. ఆదాయం ఎలా పెంచాలో ఆలోచించాలి. పోస్టల్ శాఖ పనితీరు మారాలి. కాలానుగుణంగా పని చేయాలి" అని పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు.

**గ్రామీణ డాక్ సేవక్‌ల సేవలు మర్చిపోలేం: జ్యోతిరాదిత్య సింధియా**

తపాలా వ్యవస్థపై గ్రామ ప్రజలకు ఇంకా విశ్వాసం ఉందని కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా అన్నారు. గ్రామీణ డాక్ సేవక్‌ల సేవలు మరిచిపోలేమన్నారు. " గ్రామపెద్ద, డాక్ సేవక్‌ను గ్రామీణులు ఎప్పటికీ మరిచిపోలేరు. వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారికి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరా. గ్రామీణ డాక్ సేవక్‌ల పిల్లలకు కేంద్రీయ విద్యాలయాల్లో సీట్లు వచ్చేలా చూశా. తపాలాశాఖలో పార్సిల్ వ్యవస్థ మరింత బలోపేతం కావాలి. పార్సిల్, మెయిల్ నెట్‌వర్క్‌లో వేగం పెరగాలి. గ్రామీణ డాక్ సేవక్‌లకు ఈ-స్కూటర్లు ఇచ్చేలా చూస్తాం" అని జ్యోతిరాదిత్య సింధియా అన్నారు.

## పవన్‌కల్యాణ్ దత్తత గ్రామం కొణిదెలకు కొత్తదశ

ఉన్న ఓవర్‌హెడ్ నీటి ట్యాంకు నిర్మించారు.

కొణిదెల గ్రామానికి 'పల్లె పండుగ 1.0'లో రూ.20 లక్షలకు పైగా వెచ్చించి 3 అంతర్గత రోడ్లు నిర్మించారు. 'పల్లె పండుగ 2.0'లో రూ.45 లక్షలతో చేపట్టిన 7 సీసీ రోడ్ల పనులు పురోగతిలో ఉన్నాయి. ఉప ప్రణాళిక నిధులతో స్థానిక జిల్లా పరిషత్తు స్కూలు నుంచి పగిడ్యాల మండల పరిధిలోని లక్ష్మాపురం వరకు 5 కి.మీ. మేర బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.4 కోటు, ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి గ్రామం వరకు రోడ్డు పునరుద్ధరణకు రూ.45 లక్షలు ఉప ముఖ్యమంత్రి మంజూరు చేయించారు.

ఆ గ్రామస్థుల అభ్యర్థన మేరకు 4 గోకులాలు, గృహ నిర్మాణశాఖ సహకారంతో 19 ఇళ్లు, నీటితొట్టెలు నిర్మించారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద రైతుల కోసం 49 ఫీడర్ ఛానళ్లు అభివృద్ధి చేశారు. రెండు చిన్న కాలువల పునరుద్ధరణ, 3 కమ్యూనిటీ చెక్‌డ్యాంలు బాగు చేశారు.

## ట్రంప్ మాస్టర్ ప్లాన్: ఖమేనీ, ఆయన కుమారుడిని అంతం చేసేలా వ్యూహం!

ప్రచురించింది. ఇరాన్ తదుపరి పాలకుడిగా రేసులో ఉన్న మొజ్తాబా పేరు కూడా ఈ జాబితాలో ఉండటం ప్రకంపనలు సృష్టిస్తోంది.ఇరాన్ విషయంలో అన్ని రకాల ప్రణాళికలతో సిద్ధంగా ఉన్నామని అమెరికా ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఒకవేళ యుద్ధం అనివార్యమైతే ఇరాన్ అగ్ర నాయకత్వాన్ని తొలగించేందుకు కూడా వెనుకాడబోమని ట్రంప్ సలహాదారు ఒకరు పేర్కొన్నారు. మరోవైపు, ఇరాన్‌పై పరిమిత దాడులు చేసే ఆలోచనలో ఉన్నారా అన్న ప్రశ్నకు తాను దాని గురించి ఆలోచిస్తున్నానని అధ్యక్షుడు ట్రంప్ స్వయంగా బదులిచ్చారు. చర్చలకు రావడానికి ఇరాన్‌కు 10-15 రోజులు సమయం ఇస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు.అమెరికా హెచ్చరికలపై ఇరాన్ కూడా ఘాటుగానే స్పందించింది. తాము చర్చలకు సిద్ధంగా ఉన్నామని, అయితే దాడులు జరిగితే యుద్ధానికి కూడా వెనుకాడబోమని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరగ్చీ తేల్చి చెప్పారు. అమెరికా దాడులకు పాల్పడితే మధ్యప్రాచ్యంలోని వారి సైనిక స్థావరాలే తమ తదుపరి లక్ష్యాలని ఐక్యరాజ్యసమితికి ఇరాన్ ఇప్పటికే తెలియజేసింది. ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా గత రెండు దశాబ్దాల్లో ఎన్నడూ లేనంతగా మధ్యప్రాచ్యంలో సైన్యాన్ని మోహరించింది. ఇప్పటికే రెండు అమెరికా విమాన వాహక నౌకలు ఇరాన్ తీరానికి సమీపంలో ఉన్నాయి. ఖతార్, బహ్రెయిన్ వంటి దేశాల నుంచి వేలాది మంది సైనికులను వ్యూహాత్మక ప్రాంతాలకు తరలించింది. ఇరాన్ అగ్ర నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకోవడం పూర్తిస్థాయి యుద్ధానికి దారితీయవచ్చని, ఇది వినాశకర పరిణామాలకు కారణమవుతుందని అంతర్జాతీయ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## బీజేపీకి కొత్త అర్థం చెప్పిన షర్మిల... చంద్రబాబు, జగన్ పై తీవ్ర విమర్శలు

70 దేశాల ముందు దేశ ప్రతిష్ఠను దిగజార్చారు. భారతీయ ప్రతిభను తొక్కిపెట్టి చైనా ఉత్పత్తులను చూపించి దేశానికి అవమానం తలపెట్టినప్పుడు చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడి నోళ్లు ఎందుకు పెగల్లేదు? అప్పుడు వారికి సిగ్గుగా అనిపించలేదా? కాంగ్రెస్ నిరసనలు తెలిపినప్పుడు మాత్రం వారి నోర్లు పెగిలాయి" అని వ్యాఖ్యానించారు. శాంతియుతంగా నిరసన తెలిపిన కాంగ్రెస్‌పై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని, బాధ్యత గురించి బాబు, ఐక్యత గురించి జగన్ మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని ఎద్దేవా చేశారు.కాంగ్రెస్ దేశం కోసం పోరాడుతుంటే మద్దతివ్వాల్సింది పోయి, అధికార పక్షానికి వంత పాడటం సిగ్గుచేటన్నారు. "ట్రంప్ పర్యటన సందర్భంగా అమెరికా ప్రయోజనాల కోసం సున్నా సుంకాలకు ఒప్పుకొని భారత రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టారు. ఇది రైతాంగానికి మరణశాసనం లాంటి బ్లాక్ డీల్ అని, దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రమాదకరమని చెబుతూ ఇండియన్ యూత్ కాంగ్రెస్ నిరసన తెలిపింది. ఈ వాస్తవాన్ని చంద్రబాబు, జగన్ అర్థం చేసుకోకపోవడం వారి అవివేకం" అని షర్మిల పేర్కొన్నారు.ప్రజల్లో కాంగ్రెస్‌కు మద్దతు పెరుగుతుండటం చూసి ఓర్వలేకే బీజేపీ తమ నిరసనకు ఉగ్రవాద కోణాన్ని అంటగడుతోందని, ఇది కేంద్ర ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని ఆమె మండిపడ్డారు. మోదీ కాషాయ కామెర్లు సోకిన వారు ఇలా కాకుండా ఎలా మాట్లాడతారని ఆమె వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

## హిందువుల మనోభావాలంటే వైకాపా వారికి లెక్కేలేదు: పల్లా శ్రీనివాసరావు

ప్రమా దకర రసాయనాలతో కల్తీ చేశారు. శ్రీవారి పరకామణి కేసు నిందితుడు రవికుమార్‌తో రాజీ చేసుకున్నారు. తితిదే నిధులను దారిమళ్లించారు. తిరుపతి నగరపాలక సంస్థ పేరిట రూ.కోట్లు దోచేశారు" అని పల్లా శ్రీనివాసరావు మండిపడ్డారు.


## 25న ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు వెలుగొండలో వేగవంతమైన పనుల సమీక్ష

### ఎర్రగొండపాలెం ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు

(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, ఫిబ్రవరి 22)

ఈ నెల 25న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెలుగొండ ప్రాజెక్ట్ సొరంగాలు, ఫీడర్ కెనాల్ పనుల పరిశీలనకు విచ్చేయనున్న నేపథ్యంలో ఏర్పాట్లను మరింత వేగవంతం చేశారు. ఈ సందర్భంగా సీఎం టూర్ అధికార సిబ్బందితో కలిసి టన్నెల్ లోపల జరుగుతున్న లైనింగ్ వర్క్స్ పనులను యర్రగొండపాలెం టిడిపి ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు స్వయంగా వెళ్ళి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం జిల్లా జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, ఇన్‌ఛార్జి ఆర్డీఓ శ్రీనివాసరెడ్డితో కలిసి హెలిప్యాడ్, శంకుస్థాపన పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ప్రతి ఏర్పాటును సమగ్రంగా పరిశీలిస్తూ, ఎటువంటి లోపాలు లేకుండా ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం కావాలనే దృఢ సంకల్పంతో అధికారులు, పార్టీ నాయకులతో సమన్వయం చేశారు.






## సాయుధ పోరాటం చేసిన మహావీరుడు ఉయ్యాలవాడ

### జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 22)

బ్రిటిష్ పాలనలోని ఆగడాలకు ఎదురొడ్డి అలుపెరగని సాయుధ పోరాటం చేసిన మహావీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు కొనియాడారు. స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సందర్భంగా ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన వర్ధంతి సందర్భంగా జిల్లా ఎస్పీ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ 1857 తొలి భారత స్వాతంత్ర్య సమరానికి పదేళ్ల ముందే బ్రిటిష్ దుష్టపాలనకు వ్యతిరేకంగా సాయుధ తిరుగుబాటు చేసిన ధైర్యవంతుడు నరసింహారెడ్డి అని పేర్కొన్నారు. రాయలసీమ ప్రాంతానికి చెందిన పాలెగాడు కుటుంబంలో జన్మించిన ఆయన, బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ రైతుల పై విధించిన అధిక పన్నులు, అన్యాయ విధానాలకు వ్యతిరేకంగా 1846 జూన్‌లో పోరాటం ప్రారంభించి, కోయిలకుంట్ల ఖజానా పై దాడి చేసి బ్రిటిష్ అధికారాన్ని సవాలు చేశారని తెలిపారు. వేలాది అనుచరులతో కలిసి బ్రిటిష్ దళాలకు ఎదురు నిలిచిన ఆయనను చివరకు అరెస్టు చేసి, న్యాయ విచారణ అనంతరం 1847 ఫిబ్రవరి 22న కోయిలకుంట్లలో బహిరంగంగా ఉరితీయడం జరిగిందని వివరించారు. ఆయన త్యాగం భారత స్వాతంత్ర్య చరిత్రలో చిరస్మరణీయ ఘట్టంగా నిలిచిందని, దేశభక్తి, ధైర్యం, ఆత్మగౌరవానికి ఆయన జీవితం నిదర్శనమని ఎస్పీ పేర్కొన్నారు. ప్రస్తుతం యువత దేశభక్తి భావనతో సమాజానికి సేవ చేయాలని, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవడం ద్వారా జాతీయ స్ఫూర్తిని పెంపొందించుకోవాలని సూచించారు.





ప్రకాశం | మార్కాపురం | బాపట్ల

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

23.02.26 సోమవారం


## ప్రతిరోజూ పచ్చడి, పప్పుతోనే సరి

### మెనూ అసలు పట్టించుకోరు

- స్నాక్స్ అన్నమాటే లేదు
- సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో దారుణం
- కాలేజీ హాస్టల్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన
- ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు
- హాస్టల్లో గంటసేపు పరిశీలన
- వార్డెన్ల పనితీరుపై తీవ్ర ఆగ్రహం




**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఫిబ్రవరి 22)**

కందుకూరులోని టిఆర్ఆర్ డిగ్రీ కాలేజీ ఆవరణలో గల ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్‌లో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదివారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేయటంతో బాలికలు పడుతున్న అవస్థలు వెలుగు చూశాయి. ఈ హాస్టల్‌లో టిఆర్ఆర్ కాలేజీకి చెందిన ఇంటర్, డిగ్రీ విద్యార్థులతో పాటు నర్సింగ్ విద్యార్థినులు సుమారు 200 మందికి పైగా ఉంటున్నారు. ఎమ్మెల్యే తనిఖీకి వెళ్లిన సమయంలో ఇద్దరుకు గాను ఒక్క వార్డెన్ కూడా హాస్టల్లో లేరు. ముందుగా కిచెన్ లోకి వెళ్లిన ఎమ్మెల్యే నాగేశ్వరరావు, పదార్థాలను పరిశీలించారు. ఎంతమంది బాలికలకు, ఎంత పరిమాణంలో వండుతున్నారు అనే విషయాన్ని ప్రత్యక్షంగా గమనించారు. ఈ సందర్భంగా మెనూ (తరువాయి 4లో...)


# పులలచెరువు హాస్పిటల్లో ఏం జరుగుతుంది?

**తేదీలు మార్చి ఎందుకు బ్లెడ్ రిపోర్ట్స్ ఇస్తున్నారు?**
**అసలు పేషంట్లకి రక్తపరీక్ష చేస్తున్నారా లేక**
**పాత రిపోర్ట్స్ పేర్లు మార్చి ఇస్తున్నారా..?**




ఆసుపత్రి డెవలప్‌మెంట్ సొసైటీ
ప్రాథమిక ఆరోగ్య కేంద్రం
పుల్లలచెరువు - ప్రకాశం జిల్లా.
ఓ.పి.రశీదు
రిజిస్ట్రేషన్ సంఖ్య : 2274 తేది : 16/2/26
పేరు : A. Yesamma
గ్రామము : P.che
వయస్సు : 42 స్త్రీ : ✓ పు :
ఆధార్ నెం :
వ్యాధి లక్షణములు :

| | | | | | |
|---|---|---|---|---|---|
| A.F.B. | | R.B.S. | | Urin Sug/AL Micro | |
| M.P. | | Blood Group | | UPT | |
| TYPHOID | | HIV/ICTC | | ECG | |
| H.B% | | HBs Ag | | X-Ray | |


PHC PULLALACHERUVU
Hematology Analysis Report
ID:000000000001
Name:yesamma
Time:15/02/2026 21:17

| PARAM. | RESULT | | Info |
|---|---|---|---|
| WBC | 13.0 | 10^9/L | H |
| LYM% | 20.4 | % | |
| MID% | 9.8 | % | |
| GRAN% | 69.8 | % | |
| LYM# | 2.6 | 10^9/L | |
| MID# | 1.2 | 10^9/L | |
| GRAN# | 9.2 | 10^9/L | H |
| RBC | 4.15 | 10^12/L | |
| HGB | 10.6 | g/dL | L |
| HCT | 36.1 | % | |
| MCV | 87.1 | fL | |
| MCH | 25.5 | pg | L |
| MCHC | 29.3 | g/dL | L |
| RDW_CV | 15.8 | % | |
| RDW_SD | 58.0 | fL | H |
| PLT | 284 | 10^9/L | |
| MPV | 9.3 | fL | |
| PCT | 0.26 | % | |
| P_LCR | 25.7 | % | |
| P_LCC | 72 | 10^9/L | |
| PDW_SD | 11.7 | fL | |
| PDW_CV | 14.8 | % | L |

**(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, ఫిబ్రవరి 22)**

పేదలకు నాణ్యమైన వైద్యం అందించాల్సిన పుల్లలచెరువు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ సేవల పై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రక్తపరీక్ష రిపోర్ట్ తేదీల్లో వ్యత్యాసం ఉండటంతో బాధిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది. గ్రామానికి చెందిన ఆరేవుల ఏసమ్మ (42) ఈ నెల 16వ తేదీ ఉదయం జ్వరంతో ఆసుపత్రిని ఆశ్రయించారు. వైద్యుడు కంప్లీట్ బ్లడ్ పిక్చర్ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. అదే రోజు ఉదయం ఆసుపత్రిలో రక్త నమూనా ఇచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే వారికి అందించిన హీమటాలజీ రిపోర్ట్ పై పరీక్ష తేదీగా 15-02-2026 రాత్రి 9 గంటలు నమోదు కావడం గమనార్హం. 16వ తేదీ ఉదయం శాంపిల్ ఇచ్చినప్పుడు, ముందు రోజు తేదీతో రిపోర్ట్ ఎలా వచ్చిందనే సందేహం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో "పరీక్ష చేయకుండానే పాత రిపోర్ట్‌లో పేరు మార్చి ఇచ్చి ఉండవచ్చు" అని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. అయితే ఈ ఆరోపణలపై ఆసుపత్రి సిబ్బంది నుంచి అధికారిక వివరణ లభించలేదు. జ్వరం తగ్గకపోవడంతో బాధితురాలు ఆదివారం ప్రైవేట్ ల్యాబ్‌లో రూ.500 ఖర్చు చేసి మళ్లీ రక్తపరీక్ష చేయించుకున్నట్లు సమాచారం. ప్రభుత్వ ఆసుపత్రిలో సరైన నివేదిక అందించి ఉంటే వ్యాధి తీవ్రతను ముందుగానే గుర్తించి చికిత్స పొందే అవకాశం ఉండేదని కుటుంబ సభ్యులు అంటున్నారు. ఈ ఘటన పై సంబంధిత వైద్యాధికారులు విచారణ జరిపి వాస్తవాలు వెల్లడించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. సంబంధిత అధికారిని ఈ రిపోర్టు పై వివరణ కోరగా ఒక రోజు ఆలస్యంగా రిపోర్టు ఇవ్వటానికి అవకాశం ఉంటుంది కానీ ఒక రోజు ముందు ఇవ్వటానికి ఎటువంటి అవకాశం లేదు అని చెప్పడం గమనార్హం.

**జిల్లా కలెక్టర్ రాజాబాబు**
**రూ.456 కోట్ల పనులకు శంకుస్థాపన చేయనున్న సిఎం**
**సెంటిమెంట్ స్థలంలోనే బహిరంగ సభ**
**సభా ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యే కందుల**

# సీఎం పర్యటన విజయవంతం చేయాలి

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఫిబ్రవరి 22)**

ఈ నెల 25వ తేదీన మార్కాపురం జిల్లాలో జరిగే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన విజయవంతం చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు అధికారులను ఆదేశించారు. ఆదివారం దోర్నాల మండలం వెలుగొండ ప్రాజెక్ట్ కార్యాలయంలో ముఖ్య మంత్రి పర్యటన విజయవంతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యల పై జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 25వ తేదీన రూ.456 కోట్లతో దోర్నాల మండలం గంటవాని పల్లి ఫీడర్ కెనాల్ శంకుస్థాపన పనుల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాల్గొంటారు. అనంతరం మార్కాపురం పట్టణంలో జరిగే బహిరంగసభలో ముఖ్యమంత్రి పాల్గొంటారని తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా వచ్చే ప్రజలకు త్రాగునీరు, భోజన వసతి ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.





# అసత్యాలు పదే పదే చెప్పడం వైసీపీకి వెన్నతో పెట్టిన విద్య

- శాసనమండలిలో వెంకన్న దేవుడి ఫోటోలతో రాజకీయం చేయాలని చూస్తున్నారు
- చెప్పులు, బూట్లు వేసుకొని మరి స్వామి వారి ఫోటోలు పట్టుకున్నారు
- ప్లకార్డ్ లాగా స్వామి వారి ఫోటోలు విసిరి వేశారు
- తిరిగి మీడియా సమావేశాలలో తప్పుడు మాటలతో బుకాయిస్తున్నారు
- హిందువుల మనోభావాల పై వైసిపి విషం
- మీడియా సమావేశంలో మంత్రి డోలా, ఎమ్మెల్యేలు ఉగ్ర, దామచర్ల, కూటమినేతల ధ్వజం

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, ఫిబ్రవరి 22)**

అబద్దాలను పదేపదే చెప్పి నిజంలా ఒప్పించడంలో వైసిపి నేతలకు వెన్నతో పెట్టిన విద్యని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల శ్రీ బాల వీరాంజనేయ స్వామి ధ్వజమెత్తారు. ఒంగోలులోని టిడిపి కార్యాలయంలో ఆదివారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ హిందువులు



# కన్నుల పండుగగా తెదేపా పార్టీ కార్యాలయం శంకుస్థాపన

**అతిరథ మహారథుల సమక్షంలో**
**నూతన కమిటీ ప్రమాణస్వీకారోత్సవం**
**పెద్ద ఎత్తున తరలివచ్చిన తెలుగుదేశం పార్టీ శ్రేణులు**
**తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే శ్రీరామరక్ష**
**నిజాయితీ నికార్సైన కార్యకర్తలు తెలుగుదేశం సొంతం**
**ప్రమాణ స్వీకారం మహోత్సవంలో మంత్రులు,ఎమ్మెల్యేలు**



**(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 22)**

తెలుగుదేశం పార్టీకి మరో చారిత్రాత్మక ఘట్టంగా నిలిచే కార్యక్రమం ఆదివారం బాపట్లలో అంగరంగ వైభవంగా జరిగింది. బాపట్ల పార్లమెంట్, నియోజకవర్గ నూతన కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం, అలాగే బాపట్ల పార్లమెంట్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. కొత్త కంకటపాలెం సమీపంలో దివ్య ముహూర్తంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య అతిరథ మహారథుల సమక్షంలో భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వేద పండితులు పూర్ణకుంభంతో ముఖ్య అతిథులకు ఘన స్వాగతం పలికారు. (తరువాయి 4లో...)

# ధ్యానంతో బహుళ ప్రయోజనాలు చిన్మయ మిషన్ ప్రబోధకులు పవిత్ర చైతన్య





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 22)**

ధ్యాన శిక్షణ వల్ల శారీరక మానసిక ఆరోగ్యం మెరుగుపడడమే కాకుండా పరీక్షల్లో విద్యార్థులు అత్యధిక మార్పులు సాధించ గలిగేలా దోహదపడుతుందని చిన్మయ మిషన్ ప్రబోధకులు పవిత్ర చైతన్య పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠ పాలిత శ్రీ గిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం, చిన్మయ మిషన్ సంయుక్త నిర్వహణలో శ్రీ గిరి గో క్షేత్ర భవన్ లో ఏర్పాటైన శ్రీగిరి బాలవిహార్ శిక్షణా తరగతులలో పవిత్ర చైతన్య పాల్గొని విద్యార్థులకు ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించడంతో పాటు ధ్యాన సాధన చేయించారు. హనుమాన్ చాలీసా ప్రాముఖ్యతను తెలియ చెప్పారు, అంత్యాక్షరి పోటీలో విద్యార్థులు ఉత్సాహంతో పాల్గొన్నారు. మార్చి 1వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు శ్రీగిరిలో జరిగే అఖండ హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు భక్తులు సంప్రదాయ వస్త్రాలతో పాల్గొనాలని శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి కోరారు.

# ప్రమాణ స్వీకారనికి భారీగా తరలిన మండల తెదేపా శ్రేణులు







**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఫిబ్రవరి 22)**

బాపట్ల నందు ఆదివారం జరిగిన తెదేపా పార్టీ కార్యాలయం మరియు జిల్లా కార్యవర్గ ప్రమాణ స్వీకారంలో భాగంగా బాపట్ల జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శిగా నక్కల వీర రాఘవులు, జిల్లా అధికార ప్రతినిధిగా అబ్దుల్ కలాం అజాద్ ఆదివారం చేసిన ప్రమాణ స్వీకారోత్సవానికి మండలం నుంచి పెద్ద ఎత్తున టీడీపీ శ్రేణులు తరలివెళ్ళారు. తెదేపా అధ్యక్షుడు పోద వీరయ్య, కోండ్రగంటి శ్రీహరి, రాజు ఉదయ్, యర్లగడ్డ లక్ష్మీ, నక్కల కృష్ణ, ఆశోది సుబ్బారెడ్డి, మోటుమర్రి రామసుబ్బరావు, కుక్కల వెంకటేశ్వర్లురెడ్డి, అద్దూరి వెంకటేశ్వర్లు, కోక్కిలిగడ్డ రామంజినేయలు, నరహరి శ్రీనివాసరావు, తుమ్మలపెంట జయరావు అధ్వర్యంలో మండలంలోని కడవకుదురు, కోత్త పాత గోల్లపాలం, పెదగంజాం, రాజు బంగారుపాలెం, చిన్నగంజాం, గోనసపూడి, సంతరావురు, పెదపల్లిపాలెం, మున్నంవారిపాలెం, మోటుపల్లి గ్రామల నుండి సుమారు 150 వాహనాలల్లో 1500 మంది నాయకులు, కార్యకర్తలు తరలివెళ్ళారు.

# ప్రతిరోజూ పచ్చడి, పప్పుతోనే సరి మెనూ అసలు పట్టించుకోరు







అసలు పాటించడం లేదని ఎమ్మెల్యేకి బాలికలు ఫిర్యాదు చేశారు. ప్రతి రోజు పప్పు, పచ్చడి తోనే సరిపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సాయంత్రం వేళల్లో ప్రతిరోజు స్నాక్స్ పెట్టడం మానేశారని చెప్పారు. కనీసం బెడ్స్ కూడా తగినన్ని ఇవ్వడం లేదని, అందుకే నేలపై పడుకుంటున్నామని తెలిపారు. ఈ లోపు వార్డెన్ లు ఇద్దరు అక్కడికి రావడంతో వారి పై ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్‌లో 200 మంది ఉంటున్నప్పుడు, కనీసం ఒక్కరైనా అందుబాటులో ఉండాల్సిన బాధ్యత లేదా అని గట్టిగా నిలదీశారు. మెనూ ఎందుకు పాటించడం లేదని ప్రశ్నించారు. బాలికలకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సరుకులు పంపిణీ చేస్తుంటే, ఎందుకిలా ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేలా వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడి నుంచే ఉన్నతాధికారులకు ఫోన్ చేసి హాస్టల్ పరిస్థితిలపై ఫిర్యాదు చేశారు. తాను ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళతానని, వార్డెన్లు ఇంత బాధ్యతారాహిత్యంగా ఉండడం సరికాదని ఎమ్మెల్యే అన్నారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు బాలికలతో మాట్లాడుతూ తన ఫోన్ నెంబర్ మెనూ పట్టికలో రాయిస్తున్నానని, ఎప్పుడు ఏ ఇబ్బంది వచ్చినా తనకు చిన్న మెసేజ్ చేస్తే వెంటనే హాస్టల్‌కు వస్తానని తెలియజేశారు. ఆయన వెంట పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, రాష్ట్ర ముస్లిం మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి షేక్ రఫీ, వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ, తదితరులు ఉన్నారు.

# సీఎం పర్యటన విజయవంతం చేయాలి







బహిరంగ సభ జరిగే ప్రాంతంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని, బయో టాయిలెట్లు ఏర్పాటు చేయాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. సభా ప్రాంగణంలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా భారీ కేడ్లు ఏర్పాటు చేయాలని ఆర్ అండ్ బి శాఖ అధికారులకు కలెక్టర్ చెప్పారు. అంతకు ముందు కలెక్టర్ రాజాబాబు, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డితో కలిసి వెలుగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్, హెలిప్యాడ్‌లను పరిశీలించారు. రాత్రి సమయంలో ముఖ్యమంత్రి బహిరంగ సభకు సెంటిమెంట్‌గా మారిన తర్లుపాడులోని సాయి బాలాజీ పాఠశాల ఎదురు స్థలాన్ని పరిశీలించి అధికారులకు బహిరంగ సభ ఏర్పాట్ల పై పలు సూచనలు చేశారు. పట్టుపరిశ్రమ సమీపంలోనే సిఎం హెలిప్యాడ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, వెలుగొండ ప్రాజెక్ట్ ఎస్ఈ అబూ తాలిం, డిఆర్‌డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ నారాయణ జిల్లా పరిషత్ సీఈఓ చిరంజీవి, జిల్లా పరిశ్రమలశాఖ అధికారి శ్రీనివాసరావు, పంచాయ తీరాజ్ సుబ్బారెడ్డి, విద్యుత్ శాఖ ఈఈ నాగేశ్వరరావు, ప్రాంతీయ రవాణా శాఖ అధికారి సుశీల, ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్ శివరామిరెడ్డి, డిఎస్పీ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# అసత్యాలు పదే పదే చెప్పడం వైసీపీకి వెన్నతో పెట్టిన విద్య

ఎంతో పవిత్రంగా భావించే వెంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని చెప్పులతో పట్టుకొని హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా వైసిపి నేతలు ప్రవర్తిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వార్థ రాజకీయాల కోసం ఇప్పటివరకు దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వెంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని శాసనమండలిలోకి తీసుకువచ్చి తమ స్వార్థ రాజకీయాల కోసం వాడుకోవాలని చూడటం దుర్మార్గమన్నారు. వైసీపీ నేతలు చెప్పులు వేసుకొని వెంకటేశ్వర స్వామి ఫోటోలను ప్రదర్శిస్తున్న వీడియోలు స్పష్టంగా కనిపిస్తుంటే, ఆ పార్టీ నాయకులు బొత్స సత్యనారాయణ తమ నాయకులు అసలు చెప్పులే వేసుకోలేదని మీడియా సమావేశంలో బుకాయించటం సిగ్గు పడాల్సిన విషయం అన్నారు. జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ మాధవరావు మీడియా సమావేశంలో మాట్లాడుతూ తాను అసలు చెప్పులే వేసుకోలేదని, తాము చెప్పులు వేసుకున్నట్లు నిరూపిస్తే శాసనమండలికి రాజీనామాలు చేస్తామని ప్రకటించటం, వారి దిగజారుడు రాజకీయాలకు అద్దం పడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ బాబాయి, అప్పటి టీటీడీ చైర్మన్ వై వి సుబ్బారెడ్డి తమ హయాంలో తిరుపతి లడ్డు తయారీలో నెయ్యి కల్తీ జరిగిందని స్పష్టంగా ఒప్పుకుంటున్నప్పటికీ, జగన్ మాత్రం ఇంకా నెయ్యిలో కల్తీ జరగలేదని చెప్పటం సిగ్గుపడాల్సిన విషయం అన్నారు. ఇప్పటికే పదకొండు సీట్లకు దిగజారారని, వచ్చే ఎన్నికల నాటికి ఆ పార్టీ నామరూపాలు లేకుండా పోతుందని పేర్కొన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ అత్యున్నత చట్టసభ అయిన శాసన మండలిలో శ్రీ వేంకటేశ్వర స్వామివారి చిత్రపటాల పట్ల వైసీపీ నాయకులు ప్రదర్శించిన నిర్లక్ష్య వైఖరి భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసింది అని తెలిపారు. దేవుడి చిత్రపటాలను బూట్లు, చెప్పులతో పట్టుకోవడం, అనంతరం వాటిని



నిర్లక్ష్యంగా విసరడం అత్యంత హేయమైన చర్య. ప్రజల విశ్వాసాలు, ఆధ్యాత్మిక విలువలు మరియు సంప్రదాయాలను గౌరవించడం ప్రతి ఒక్క ప్రజాప్రతినిధి బాధ్యత అన్ని అన్నారు. ప్రజాస్వామ్య విలువలు మరియు మత సామరస్యాన్ని దెబ్బతీసే విధానాలను ప్రజల ముందు ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. భవిష్యత్‌లో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అన్ని మతాలను గౌరవిస్తూ సమాజంలో శాంతి, సామరస్యాన్ని కాపాడటం మనందరి బాధ్యత అన్నారు. టిడిపి ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షులు, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్షం కోసం జగన్ అసెంబ్లీకి రాకుండా తమకు ప్రతిపక్ష హోదా కావాలని మాట్లాడటం సిగ్గుపడాల్సిన విషయం అన్నారు. కలియుగ దైవం వెంకటేశ్వర స్వామిని తన రాజకీయాల కోసం వాడుకోవటం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెంకటేశ్వర స్వామి ని తన కుల దైవంగా భావిస్తారని, తిరుపతి విషయంలో ఎవరు అవినీతికి పాల్పడిన ఒప్పుకోరని పేర్కొన్నారు. సిట్ తిరుపతి లడ్డులో నెయ్యి కల్తీ జరిగిందని, అది అసలు నెయ్యి కాదు, రసాయనాల మిశ్రమం అని తేల్చిన జగన్ ఇంకా



బుఖారించటం దుర్మార్గమన్నారు. చేసిన తప్పులను ఒప్పుకోవాలని, లేనిపక్షంలో వెంకటేశ్వర స్వామి తగిన శిక్ష విధిస్తారని పేర్కొన్నారు. బిజెపి జిల్లా అధ్యక్షులు సేగ్గం శ్రీనివాసరావు మాట్లాడుతూ వైసీపీ నేతలు హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ప్రవర్తిస్తుంటే చూస్తూ ఊరుకోమన్నారు. శాసనమండలిలో వైసీపీ నేతలు ప్రవర్తించిన తీరు హిందువుల మనోభావాలు దెబ్బతినేలా ఉన్నాయన్నారు. జనసేన పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా నాయకులు, రవి ప్రియ మాల్ అధినేత కంది రవిశంకర్ మాట్లాడుతూ వైసిపి నేతల తీరు ప్రపంచంలోని హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయన్నారు. ఇప్పటికైనా చేసిన తప్పులను ఒప్పుకోవాలని, లేనిపక్షంలో ఆ వెంకటేశ్వర స్వామి వారికి తగిన శిక్ష విధిస్తారని పేర్కొన్నారు. సమావేశంలో టిడిపి ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి కొఠారి నాగేశ్వరరావు, ఒంగోలు ఏఎంసీ చైర్మన్ రాచగర్ల వెంకట్రావు, బండారు మదన్,తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో శాసనమండలిలో వైసిపి నేతల తీరును, మీడియా సమావేశంలో వారు మాట్లాడిన తీరును క్లిప్పింగుల ద్వారా మీడియా ముందు ప్రదర్శించారు.

# కన్నుల పండుగగా తెదేపా పార్టీ కార్యాలయం శంకుస్థాపన

**ప్రముఖుల సమక్షంలో శుభారంభం....** ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బాపట్ల జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి, గృహ నిర్మాణ, సమాచార



పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు, బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు, చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య, సంతనూతలపాడు ఎమ్మెల్యే బి.యన్. విజయ్ కుమార్, బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు సలగల రాజశేఖర్ బాబు, ప్రధాన కార్యదర్శి నక్కల రాఘవ తదితరులు హాజరై భూమిపూజలో పాల్గొన్నారు. అదేవిధంగా కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, జిల్లా నాయకులు, పెద్ద ఎత్తున పార్టీ కార్యకర్తలు హాజరయ్యారు.



**కార్యకర్తలే పార్టీకి శ్రీరామరక్ష...** ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ "నిజాయితీ, నికార్సైన కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ సొంతం. కార్యకర్తలే పార్టీకి శ్రీరామరక్ష" అని అన్నారు. కోటి సభ్యత్వాలు కలిగిన ఏకైక పార్టీ తెలుగుదేశమేనని, ప్రజల కోసం పనిచేసే వ్యక్తులకు ఈ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఎన్టీఆర్ ఆవిర్భావం నుండి చంద్రబాబు, లోకేష్ సమర్థ నాయకత్వంలో పార్టీ ప్రజా సేవే లక్ష్యంగా ముందుకు సాగుతోందని తెలిపారు. ఎన్ని ఒడిదొడుకులు వచ్చినా కార్యకర్తలు నిద్రాహారాలు మాని పార్టీ కోసం కృషి చేశారని కొనియాడారు. "పార్టీ కార్యాలయం ప్రతి కార్యకర్తకు దేవాలయం లాంటిది. అధికారంలో ఉన్నా లేకున్నా తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ ప్రజల పక్షానే నిలుస్తుంది" అని స్పష్టం చేశారు.

**వైసిపి పై విమర్శలు....** గత పాలకులు రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టారని, అబద్ధాల పునాదులపై ఏర్పడిన పార్టీ వైసీపీ అని విమర్శించారు. ప్రజలు జగన్‌కు ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదని, దేవుడి పేరుతో కూడా రాజకీయాలు చేయడం సరికాదని మండిపడ్డారు.

**అంగరంగ వైభవంగా ప్రమాణ స్వీకారం....** భూమిపూజ అనంతరం వేలాది మంది కార్యకర్తల సమక్షంలో బాపట్ల పార్లమెంట్ నూతన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. నినాదాలతో సభా ప్రాంగణం మార్మోగింది. అనంతరం ముఖ్య అతిథులకు, కమిటీ సభ్యులకు పూలమాలలు, శాలువాలతో ఘన సత్కారం నిర్వహించారు. బాపట్లలో జరిగిన ఈ కార్యాలయ శంకుస్థాపన, కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. భవిష్యత్ రాజకీయాలకు బాపట్ల కేంద్రంగా మారబోతుందనే సందేశాన్ని ఈ కార్యక్రమం స్పష్టంగా చాటింది. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పిలుపుమేరకు పర్చూరు నుంచి వందలాది వాహనాలలో వేలాది మంది కార్యకర్తలు భారీ ర్యాలీగా సభ ప్రాంగణానికి చేరుకున్నారు.

# కందుకూరు మున్సిపాలిటీలో అభివృద్ధి పరుగులు

# ఇప్పటికే రూ.20 కోట్లతో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం

## సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణకు కృతజ్ఞతలు


## అభివృద్ధిలో రాజీలేదన్న ఎమ్మెల్యే ఇంటూరి

## రూ.28.5 లక్షలతో నిర్మించిన రోడ్డు, డ్రైనేజీ ప్రారంభం









(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఫిబ్రవరి 22)

కందుకూరు మున్సిపాలిటీ అభివృద్ధిలో ఎక్కడా రాజీపడకుండా కోట్ల రూపాయలతో పనులు చేస్తున్నట్లు కందుకూరి శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. పట్టణంలోని దివి శివలింగప్రసాద్ ఇంటి వద్ద నుంచి తాళ్లూరి రమణయ్య ఇంటి వరకు 28.5 లక్షలతో కొత్తగా నిర్మించిన సీసీ రోడ్డు, సిసి డ్రైన్‌ను ఎమ్మెల్యే నాగేశ్వరరావు ఆదివారం ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు వార్డు అధ్యక్షుడు కొచ్చర్ల తనూజ్ ఆధ్వర్యంలో స్థానికులు, మహిళలు ఘన స్వాగతం పలికారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి కందుకూరు మున్సిపాలిటీ పరిధిలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదన్నారు. ఎక్కడ చూసినా గుంతల రోడ్లు కనిపించాయని చెప్పారు. గత ఎన్నికల ప్రచార సమయంలో కూడా స్థానికులు ఈ రోడ్డు సమస్యను తన దృష్టికి తీసుకువచ్చారని చెప్పారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కందుకూరు పర్యటనకు వచ్చినప్పుడు, మున్సిపాలిటీ గురించి ఆయనకు వివరించడం జరిగిందన్నారు. వెంటనే స్పందించిన సీఎం, 50 కోట్ల రూపాయలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారని గుర్తు చేశారు. అందులో భాగంగా ఇప్పటికే 20 కోట్ల నిధులు మున్సిపాలిటీకి విడుదల కాగా, వాటితో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని ఎమ్మెల్యే నాగేశ్వరరావు వివరించారు. గత ఎన్నికల్లో కందుకూరు మున్సిపాలిటీ ప్రజలు తనకు అత్యధిక మెజారిటీ ఇచ్చిన విషయాన్ని తాను ఎప్పటికీ మరిచిపోనని ఎమ్మెల్యే నాగేశ్వరరావు స్పష్టం చేశారు. కందుకూరు అభివృద్ధికి గురించి అడిగినప్పుడల్లా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధతో నిధులు ఇస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ సహకారం మరువలేనిదని చెబుతూ వారిద్దరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఇద్దరి సహకారంతో మునిసిపాలిటీలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామని, రాబోయే రోజుల్లో కందుకూరును నెంబర్ వన్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే అనూష, పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, నెల్లూరు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు ఉన్నం వీరాస్వామి, పార్టీ సీనియర్ నేతలు పిడికిటి వెంకటేశ్వర్లు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధు, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్, నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చదలవాడ కొండయ్య, వార్డు అధ్యక్షుడు కొచ్చర్ల తనూజ్, స్థానిక నేతలు బెల్లం వెంకటేశ్వర్లు, వడ్డేళ్ల వెంకట్రావు, కొడాలి శ్రీధర్, చుండూరి మాల్యాద్రి, నల్లూరి సింగయ్య, దివి శ్రీను, రావి జాలయ్య, రాయి రాము, అత్తోట మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

## మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోండి

### నేడు కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ నిర్వహణ

### జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా కలెక్టర్ పి రాజబాబు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 22)

మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి (మీకోసం డాట్ ఏపీ డాట్ జివోవి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ నెల 23వ తేదీన సోమవారం ఒంగోలు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి ఘన నివాళులు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 22)

ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం స్టెప్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటానికి జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, స్టెప్ సిఈఓ పి శ్రీమన్నారాయణలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్, స్టెప్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్లకు శంకుస్థాపన చేసిన మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి









(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, ఫిబ్రవరి 22)

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పట్టణంలోని 27, 16,8,3 వ వార్డులలో సుమారు రూ.43 లక్షలతో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఆయా ప్రాంతాల్లో ఆయన కొబ్బరికాయలు కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయా వార్డు నాయకులు ఆయనకు పూలమాలలు వేసి శాలువాలు కప్పి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ మార్కాపురం జిల్లా రాజధాని అయిన తర్వాత మార్కాపురం పట్టణాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక వార్డు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్వచ్ఛఆంధ్ర, స్వర్ణ ఆంధ్రా ఎన్ఎస్ఎస్ లక్ష్యం

### ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డివిఆర్ మూర్తి






(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 22)

స్వచ్ఛత యాక్షన్ ప్లాన్ వన్ డే మాసివ్ క్లినిక్ ప్రోగ్రామ్ ఆదివారం విజయవంతంగా జరిగింది. కొత్తపట్నం సముద్ర తీరాన ఆంధ్రా కేసరి విశ్వ విద్యాలయం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఆదిత్య కాలేజీ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సంయుక్తంగా స్వచ్ఛ భారత కార్యక్రమం ఘనంగా నిర్వహించటం జరిగింది. ఈ కార్యక్రమం గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మినిస్టర్ ఆఫ్ యూత్ అఫ్ఫైర్స్, రీజినల్ డైరెక్టరేట్ హైదరాబాద్ వారు సంయుక్తంగా నిర్వర్తించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్రా కేసరి విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డివిఆర్ మూర్తి ఉపన్యాసిస్తూ ఈ దేశం లో ప్రజలందరు ప్లాస్టిక్ విరివిగా ఉపయోగిస్తున్నారు అని ఈ ప్లాస్టిక్ ను ఉపయోగించటం వలన జల కాలుష్యం, వాయు కాలుష్యం, భూమి కాలుష్యం, మరియు వాతావరణం సమతుల్యం కోల్పోతుంది అని అదే విధంగా సముద్రం లో కొన్ని జీవ రాశులు ఈ ప్లాస్టిక్ వలన జీవ మనుగడకు కష్టం గా మారిందని దీని ఫలితంగా జీవ వైవిధ్యం మానవ మనుగడకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని. దీనిని ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతతో ప్లాస్టిక్ ను నివారించాలని. విద్యార్థులు మరియు చీూా వాలంటీర్లు కమ్యూనిటీ గ్రామాల్లోనూ, పట్టణాల్లోనూ, ప్రజలని చైతన్యం చేస్తూ సమాజం లోని ప్రజలను జాగృతం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమ నిర్వాహకులు, కార్యక్రమ అధ్యక్షులు ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం కోఆర్డినేటర్ మండే హర్ష ప్రీతం దేవ్ కుమార్ అధ్యక్ష ఉపన్యాసం చేస్తూ వాతావరణం గ్లోబల్ వార్మింగ్‌కి గురవుతుందన్నారు. వీటిని నివారించాలంటే విద్యార్థులు, యువత, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ప్రజలను చైతన్యం చేయాలన్నారు. ప్రపంచంలోని మూడో వంతుల నీరు ఒక వంతు భూభాగం ఉన్నందు వలన ఆ భూభాగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మానవుల పై ఉం గనుక పరిసరాలను భూమిని, నీటిని, కలుషితం కాకుండా వృక్షాలను విరివిగా పెంచి మరియు జీవరాశులను సంరక్షించి వాతావరణ సమతుల్యాన్ని కాపాడుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో పాల్గొన్న ఆదిత్య డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ సురేష్, చీఫ్ ప్రోగ్రామ్ ఆఫీసర్ శ్రీనివాస్, ఆంధ్రా కేసరి విశ్వవిద్యాలయం కెమిస్ట్రీ విభాగం అధ్యాపకురాలు ప్రసన్న లక్ష్మీ, కంప్యూటర్ సైన్స్ విభాగం అధ్యక్షురాలు వి ప్రభావతి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సీనియర్ విద్యార్థులు రెహమాన్, గ్లోరి, జూనియర్ విద్యార్థులు ఇందుమతి, విద్యాసాగర్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు విద్యార్థులు పాల్గొని 84 కేజీల ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి కొత్తపట్నం గ్రామ పంచాయతీ పారిశుధ్య సిబ్బందికి అందించారు. ఇందులో మెరైన్ సిఐ, సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## పల్లెపాలెం గ్రామం కోళ్లఫారంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్

## రూ.1.50 లక్షల ఆస్తి నష్టం







(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఫిబ్రవరి 22)

మండల పరిధిలోని చాకిచెర్ల పెద్ద పట్టపుపాలెం పంచాయతీ పల్లెపాలెం గ్రామానికి చెందిన పొన్నాడి వీర నారాయణ బ్రతుకు తెరువు కోసం కోళ్ల ఫారం నిర్వహిస్తుండేవాడు. ఆదివారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో కోళ్ల ఫారంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి రూ.1.50 లక్షలు విలువచేసే పౌల్ట్రీ షెడ్, కోళ్లు, దాన నిల్వలు, మరియు మౌలిక సదుపాయాలు పూర్తిగా దహనం అయ్యాయి.

## యర్రగొండపాలెంలో మానవత్వం చాటుకున్న చిన్నారులు



(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, ఫిబ్రవరి 22)

యర్రగొండపాలెం పట్టణానికి చెందిన చిన్నారి తలలో క్యాన్సర్ గడ్డతో బాధపడుతుందన్న విషయం తెలుసుకున్న ముస్లిం చిన్నారి విద్యార్థులు తమ వంతుగా సహాయం అందించారు. పట్టణంలో టైలర్‌గా జీవనం సాగిస్తున్న నారాయణ కుమార్తె తొమ్మిదేళ్ల గోపిక పూర్ణిమ క్యాన్సర్‌తో బాధపడుతున్న విషయం తెలుసుకున్న చిన్నారి విద్యార్థులు తమ వీధులలో పరిచయస్తుల వద్ద విరాళాలు సేకరించారు. సేకరించిన రూ.3,550లు గోపి పూర్ణిమ తండ్రి వెంకట నారాయణకు మత పెద్దల సమక్షంలో అంద జేశారు. రంజాన్ ఉపవాస దీక్షలో ఉన్న 6, 7వ తరగతి చదువుతున్న సయ్యద్ సిద్ధిక్, తోఫీద్, సీమాల్, జోఫీద్, మహమ్మద్‌లు సేవా దృక్పధం చాటుకున్నారు.

# ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ లక్ష్యంగా కార్డన్ సెర్చ్ నిర్వహించిన పోలీసులు

## సరైన పత్రాలు లేని 29 మోటార్‌సైకిళ్లను, 5 ఆటోలు స్వాధీనం చేసుకున్న పోలీసులు




(షణ్ముఖ వెలుగు, అద్దంకి, ఫిబ్రవరి 22)

శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ మరియు అసాంఘిక కార్యకలాపాల కట్టడమే లక్ష్యంగా ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు దర్శి డిఎస్పీ బి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో అద్దంకి టౌన్‌లోని గరటయ్య కాలనీ పరిసర ప్రాంతంలో విస్తృత స్థాయిలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ ఆదివారం నిర్వహించారు. ఈ తనిఖీల్లో దర్శి డిఎస్పీ లక్ష్మీనారాయణ, అద్దంకి సీఐ సుబ్బరాజు, ఎస్ఐలు, 38 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ పరికరాల ద్వారా అనుమానితుల తనిఖీ చేశారు. తనిఖీలలో భాగంగా గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నిల్వ, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించి ఇళ్లు, దుకాణాలు, ఇతర ప్రదేశాలను సోదాలు చేశారు. సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 29 మోటార్‌సైకిళ్లు, 5 ఆటోలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కొందరు వాహన యజమానులకు చలానాలు విధించారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణ, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, సైబర్ నేరాలు, కొత్త చట్టాలు, మహిళలపై నేరాలు మరియు వాటి శిక్షల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. తదనంతరం "డ్రగ్స్ వద్దు బ్రో" అనే నినాదంతో స్థానిక ప్రజలతో కలిసి గంజాయికి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. యువత, వ్యాపారులు, కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని "గంజాయిని పారదోలుదాం, డ్రగ్స్ నిర్మూలనకు కట్టుబడుదాం" అంటూ ప్రతిజ్ఞ చేశారు. దర్శి డిఎస్పి బి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత జీవితానికే కాకుండా కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి విద్య, క్రీడలు, ఉపాధి వంటి వాటిపై దృష్టి సారించాలని సూచించారు. డ్రగ్స్ విక్రయం లేదా వినియోగానికి పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్డాన్ సెర్చ్ లో బల్లికురవ ఎస్ఐ నాగరాజు, సంతమాగులూరు ఎస్ఐ పట్టాభిరావు, కొరిశపాడు ఎస్ఐ సురేష్, కొనకనమిట్ల ఎస్ఐ రఫీ, తాళ్లూరు ఎస్ఐ మల్లికార్జున, దొనకొండ ఎస్ఐ త్యాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.





# ప్రజల భద్రతకు ప్రాధాన్యం నేరాల నియంత్రణకు కార్డన్ అండ్ సెర్చ్ చేపట్టిన పోలీసులు

## కొండేపిలో కార్డెన్ అండ్ సెర్చ్ 33 వాహనాలు సీజ్



(షణ్ముఖ వెలుగు, కొండపి, ఫిబ్రవరి 22)

ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు కందుకూరు డిఎస్పీ సిహెచ్ వి బాలసుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో ఆదివారం ఉదయం కొండేపి మండల కేంద్రంలోని బీసీ కాలనీలో కార్డెన్ అండ్ సెర్చ్ (తనిఖీలు) నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొండేపి సిఐ జి సోమశేఖర్, కొండేపి, పొన్నలూరు ఎస్ఐలు ప్రేమ్ కుమార్, పి సత్యనారాయణ, వారి సిబ్బందితో కలిసి 30 మంది పోలీసులతో ఈ ఆపరేషన్ నిర్వహించారు. ప్రజల భద్రతను కాపాడటం, గంజాయి కోసం తనిఖీ, బెల్టు షాపులు నిర్వహణ అరికట్టడం, నేరాలను అదుపు చేయడమే లక్ష్యంగా ఈ తనిఖీలు జరిగాయి. కాలనీలోని ప్రతి ఇంటిని, అనుమానిత వ్యక్తులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని 28 ద్విచక్ర వాహనాలను, 5 ఆటోలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 33 వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణ, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, సైబర్ నేరాలు, కొత్త చట్టాలు, మహిళలపై నేరాలు, వాటి శిక్షల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కొండేపి సిఐ జి సోమశేఖర్ మాట్లాడుతూ ప్రజలు తమ వాహనాలకు సంబంధించిన ఒరిజినల్ పత్రాలను ఎల్లప్పుడూ కలిగి ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తులు లేదా అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. గంజాయి విక్రయించడం మరియు సేవించేటు వంటి వ్యక్తుల గురించి సమాచారాన్ని కనుగొనడం, బెల్ట్ షాపుల నిర్వహణ అరికట్టడం, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఇలాంటి ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు.





# నాగమల్లేశ్వరావుకి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సేవా పురస్కారం

(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఫిబ్రవరి 22)



చిన్నగంజాం మండలం సోపిరాల గ్రామస్థుడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల రామచంద్ర నగర్ లో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న సిద్ధం నాగమల్లేశ్వరరావు ప్రథమ స్వాతంత్ర్య సమర యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సేవా పురస్కారం 2026 కు ఎంపికయ్యారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 179వ వర్ధంతి ఫీవఎ-22 సందర్భంగా సమాజంలో వివిధ రంగాలలో నిరంతరం సేవ చేసే వారిని గుర్తించి ఎంపిక చేసి ఆన్లైన్ ద్వారా ప్రధానం చేసినందుకు వాజ్ పేయి, అద్వానీ సేవా సంస్థ వ్యవస్థాపకులు పాలకొలను వీరారెడ్డి  కి అవార్డు గ్రహీత సిద్ధం నాగమల్లేశ్వరరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేశారు.ఇ సందర్భంగా వాజ్ పేయి, అద్వానీ సేవా సంస్థ వ్యవస్థాపకులు పాలకొలను వీరారెడ్డి వివరాలు తెలియాజేస్తూ గత 24 సంవత్సరాలుగా ఉపాధ్యాయునిగా పనిచేస్తూ విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడుతూ అక్షర ప్రకాశం, పల్స్ పోలియో, రక్తదాన శిబిరాల నిర్వహణ, కరోనా సమయంలో అవగాహన కార్యక్రమాలు, తుఫాను సమయాలలో ప్రజలను అప్రమత్తత చేయడం తదితర అంశాలను పరిగణన లోనికి తీసుకొని ఈ అవార్డుకు ఎంపిక చేయడం జరిగినదని తెలియజేశారు. నాగమల్లేశ్వరావుకి అవార్డు లభించిన సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాయబ్ రసూల్, పేరెంట్ కమిటీ చైర్మన్ మస్తాన్‌రావు, ఉపాధ్యాయులు ఎం వెంకటేశ్వర్లు, పి శ్రీనివాసరావు, పి సరళ, పి హిమమంతేశ్వరి, సురేంద్ర కుమార్, అభినందనలు తెలియజేశారు.

# ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాల పరిశీలన

(షణ్ముఖ వెలుగు, కనిగిరి రూరల్, ఫిబ్రవరి 22)

ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను ఆదివారం డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా ఉండేందుకు కేంద్రాల్లో ఉన్న సదుపాయాలు, లిభద్రతా ఏర్పాట్లు, నిర్వహణ విధానాలను పరిశీలించారు. పరిశీలన సందర్భంగా గుర్తించిన చిన్నపాటి లోపాలను సరిదిద్దాలని సంబంధిత అధికారులకు సూచనలు ఇచ్చారు పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించబడేలా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయడమే కాకుండా, డ్రోన్ సర్వైలెన్స్ కూడా ఏర్పాటు చేసి భద్రతను బలోపేతం చేస్తామని తెలిపారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయడానికి పోలీస్ శాఖ పూర్తిస్థాయి సహకారం అందిస్తుందని డీఎస్పీ తెలిపారు.









## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి పలువురికి స్వల్ప గాయాలు





(షణ్ముఖ వెలుగు, పామూరు, ఫిబ్రవరి 22)

కర్ణాటక రాష్ట్రంకి చెందిన కొంతమంది యాత్రికులు శ్రీశైలం నుండి వస్తు రోడ్డు ప్రమాదంలో పామూరు మండలం గోపాలపురం గ్రామం ఎన్‌హెచ్-167 హైవే నందు టెంపోలో వెళ్తూ ముందు వెళ్తున్న కంకార ట్రాక్టరును ఢీకొట్టారు. దీంతో యం విశాల లక్ష్మి అక్కడిక్కడే దుర్మరణం చెందారు. వారి కుటుంబం సభ్యులకు స్వల్ప గాయాలు కావడంతో పామూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం డాక్టర్‌తో మాట్లాడి కందుకూరు ఏరియా ఆసుపత్రికి తరలిస్తామని డ్యూటీ డాక్టర్ చెప్పారు. మృతి చెందిన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పడం జరిగింది.

## కనిగిరిలో రౌడీ షీటర్లు, లైంగిక నేరస్తులపై కౌన్సెలింగ్





(షణ్ముఖ వెలుగు, కనిగిరి రూరల్, ఫిబ్రవరి 22)

కనిగిరి పట్టణంలో రౌడీ షీటర్లు, లైంగిక నేరస్తుల షీటర్లకు డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ వారికి చట్టాల గురించి అవగాహన కల్పిస్తూ, నేర ప్రవర్తనకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. సమాజంలో శాంతి భద్రతలు కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందని, భవిష్యత్తులో ఎలాంటి నేరాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే మంచి పౌరులుగా మారి సమాజంలో గౌరవప్రదమైన జీవితం గడపాలని సూచించారు. నేర మార్గాన్ని విడిచి సన్మార్గంలో నడవాలని వారికి సూచనలు ఇచ్చారు. కార్యక్రమం ముగింపులో రౌడీ షీటర్లు, లైంగిక నేరస్తులతో "ఇక పై ఎలాంటి నేరాలకు పాల్పడబోము, చట్టాలను గౌరవిస్తాము, శాంతిభద్రతలకు సహకరిస్తాము" అనే ప్రతిజ్ఞ చేయించారు. పోలీసుశాఖ సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుబడి ఉందని డీఎస్పీ తెలిపారు.

## వేతనాలు పెంచాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలి - సమ్మె



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 22)

2025 జూన్ 12 నుండి. 22 వరకు ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలని. పారిశుద్ధ్య కార్మికు సంక్షేమ పథకాల అమలు చేయాలని సమ్మె చేయడం జరిగింది. ఈ సమ్మెకాలపు వేతనాలను చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 137 ను తేదీ 10-2-2026 జీతం చెల్లించమని జీవో చారీ చేయడం జరిగింది. 13-2-2026న అన్ని మున్సిపల్ కమిషనర్లకు మున్సిపల్ సిడిఎంఏ సర్కులర్ జారీ చేయడం జరిగింది. ఈ సమ్మె కాలపు జీతాలు చెల్లించాలని ఒంగోలు నగరపాలక కమిషనర్ డాక్టర్ కే వెంకటేశ్వరావుకి ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్(సిఐటియు), నగర కమిటీ ఆధ్వర్యంలో జీవోలు వినతి పత్రం ఇచ్చారు. ఈ జీవోలు జారే చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మున్సిపల్ శాఖ మంత్రి పి నారాయణ, ఉన్నతాధికారులకు ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు), ఒంగోలు మున్సిపల్ నగర కమిటీ తరఫున అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. కమిషనర్ కి వినతి పత్రం ఇచ్చిన వారిలో సిఐటియు ఒంగోలు నగర కన్వీనర్ టి మహేష్, మున్సిపల్ జిల్లా కార్యదర్శి కొర్నెపాటి శ్రీనివాసరావు, యూనియన్ నగర అధ్యక్ష, కార్యదర్శులు జి నరసింహం, టి విజయమ్మ, ఆర్ శ్రీను, ఎం బాబు, కే మోహన్‌రావు, టి రమేష్ పాల్గొన్నారు.

# అమెరికా సామ్రాజ్యవాదానికి దాసోహం అంటున్న మోడీ విధానాలను ప్రతిఘటించాలి

## వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు పిలుపు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 22)

దేశంలోని కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలను కాపాడేందుకే మోడీ ప్రభుత్వం అమెరికాకు దాసోహం ఉంటుందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు అన్నారు. వ్యవసాయ కార్మికోద్యమనేత, మాజీ శాసనసభ్యులు తవనం చెంచయ్య వర్ధంతి సందర్భంగా ఆదివారం ఎల్బీజీ భవన్ లో "సామ్రాజ్యవాదం నిన్న – నేడు" అనే అంశంపై సెమినార్ జరిగిన సెమినార్ కు జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ అంబానీ ఆదాని లాంటి బడా కార్పొరేట్లకు దేశంలోని సహజ వనరులు, ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రజా సంపదనంతా మోడీ ప్రభుత్వం కట్టబెడుతున్నదని విమర్శించారు. లక్షల కోట్లు కూడబెట్టుకున్న కార్పొరేట్లకు విదేశీ వ్యాపారాలు, అమెరికా లాంటి దేశాలతో వాణిజ్య సంబంధాలు అవసరమయ్యాయని వారికి దోహదపడే విధంగా మన విదేశాంగ విధానాన్ని రూపొందిస్తున్నారని మండిపడ్డారు. ప్రజల ప్రయోజనాలు, దేశంలోని వ్యవసాయం, పారిశ్రామిక రంగాలు, వాటి మీద ఆధారపడిన భారత ఆర్థిక వ్యవస్థ, మన ఎగుమతులు దిగుమతుల విధానం దేశ ప్రయోజనాలకు కాక, కార్పొరేట్ల ప్రయోజనాలకు అనుకూలంగా మారిపోతున్నదని అన్నారు. మన దేశంతో పాటు ఎక్కడ ఏ వనరులు ఉంటే వాటికోసం మూడవ ప్రపంచ దేశాలను అదిరించి బెదిరించి అమెరికా తన గుప్పెట్లో పెట్టుకునేందుకు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నదని అన్నారు. ప్రజాస్వామ్యం, ప్రజల హక్కుల గురించి మాట్లాడే అమెరికా నియంతృత్వంగా, నిరంకుశంగా ప్రపంచ దేశాల్లోని వనరులు కొల్లగొట్టేందుకు ఎటువంటి ఆగడాల కైనా సిద్ధపడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెనుజులా దేశంలో ఉన్న చమురు నిక్షేపాలను దోచేందుకు ఆ దేశాధ్యక్షుడు డ్రగ్స్, ఉగ్రవాదం పెరిగేందుకు అవకాశం ఇస్తున్నాడని నెపం మోపి, కిడ్నాప్ చేసి తమ దేశానికి తీసుకెళ్లి జైల్లో వేశారని అన్నారు. ఈ హక్కు



అమెరికాకు ఎవరు ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. ఒక ప్రజాస్వామ్య దేశం మీద జరిగిన దాడిని అన్యాయం అనలేని స్థితిలో భారత ప్రభుత్వం వ్యవహరించడం, ప్రపంచంలో పెద్ద ప్రజాస్వామ్య దేశమని చెప్పుకోవటం సిగ్గుచేటన్నారు. సామ్రాజ్యవాదం అనేది ఉన్నంతవరకు దోపిడీ, పీడన ప్రపంచ యుద్ధాలు అనివార్యంగా జరుగుతాయని అన్నారు. తమ స్వార్థ ప్రయోజనాల కోసం సామ్రాజ్యవాదులు ప్రజల్ని బలి పశువులుగా మార్చుతారని, ఎంతటి అకృత్యాలకైనా సిద్ధపడతారని అన్నారు. యుద్ధాలు లేని, ప్రపంచ శాంతి వర్ధిల్లే స్థితులు రావాలని, సమ సమాజం కోసం జరిగే పోరాటాలు మరింత బలపడాలని ఆకాంక్షించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ తవనం చెంచయ్య తన జీవితమంతా అంటరానితనం నిర్మూలన కోసం, అనగారిన వర్గాలపై దాడులు దౌర్జన్యాలు అంతం కోసం పోరాడారని తెలిపారు. భూమికోసం, భుక్తి కోసం, కష్టజీవుల విముక్తి కోసం సమసమాజ సాధన కోసం సమరశీల పోరాటాలు నిర్వహించారని తెలిపారు. ఆయన ఆశయాన్ని సాధించేందుకు అంకితభావంతో పని చేద్దామని అన్నారు. సమాజ సమస్యలన్నీటికి పరిష్కారం చూపేది సోషలిస్టు వ్యవస్థని, పేదరికం, నిరుద్యోగం, అసమానతలు, ఆకలి చావులు లేని వ్యవస్థను ఒకప్పటి సోవియట్ రష్యాలోనూ, నేటి సోషలిస్టు దేశాల్లోనూ చూస్తున్నామని తెలిపారు. అలాంటి సమసమాజ సాధనకు, నేడు ఉన్న సోషలిస్టు రాజ్యాల అభివృద్ధికి అమెరికా సామ్రాజ్యవాదం ఆటంకంగా వ్యవహరిస్తున్నదని అన్నారు. సామ్రాజ్యవాదాన్ని ఎదుర్కొనే విధంగా సమసమాజాన్ని సాధించే విధంగా పోరాటాలు రూపొందిద్దామని ఆయన అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం సీనియర్ నాయకులు జాలా అంజయ్య, మొండ్రు ఆంజనేయులు మాట్లాడుతూ తవనం చెంచయ్య నిస్వార్థంగా, నిరాడంబరంగా ప్రజల కోసం జీవించాడని తెలిపారు. శాసనసభ్యుడిగా ప్రజా సమస్యల పరిష్కారానికి చట్టసభలను వేదికలుగా చేసుకున్నారని అన్నారు. ఆయన జీవితం ఆదర్శనీయం అనుసరణీయం అని అన్నారు. సభకు ముందుగా తవనం చెంచయ్య చిత్రపటానికి సీనియర్ నాయకులు ఉబ్బా కోటేశ్వరరావు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కంకణాల వెంకటేశ్వర్లు, ఉబ్బా వెంకటేశ్వర్లు, టి సుజాత, ఎం సుబ్బారావు, కంచర్ల సుధాకర్, జి చెన్నకేశవులు, చలపతి, భాస్కర్, రవి, కోటేశ్వరరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి, జిల్లా నాయకులు యన్ మాలతి, తిరుపతమ్మ, జయమ్మ పాల్గొన్నారు.

---

# బిజెపి కడప జిల్లా కార్యదర్శిగా కొలిశెట్టి రమణయ్య



(షణ్ముఖ వెలుగు, బద్వేల్, ఫిబ్రవరి 22)

1986వ సంవత్సరంలో భారతీయ జనతా పార్టీలో చేరినటువంటి కొలిశెట్టి రమణయ్య ఎన్నో సంవత్సరాలుగా పార్టీకి సేవ చేస్తూ ఎంతో మంది కార్యకర్తలకు ఆదర్శవంతంగా ఎదిగిన వ్యక్తి. ఆయన హుందాతనం, మంచితనం, మానవత్వం కలిగిన వ్యక్తిగా పార్టీ సీనియర్ నాయకులు కీ ఎంతోకాలంగా పరిచయం ఉన్న కార్యకర్త. పార్టీ ఆదేశానుసారం పార్టీ కార్యకలాపాల్లో ఉత్సాహంగా పాల్గొని కార్యకర్తలందరిని ఉత్సాహపరచడం ఆయన నైజం. 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎక్కడ తడబడని వ్యక్తిత్వం. ఇటీవల ఆంధ్రప్రదేశ్లో కూటమి ప్రభుత్వం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేపట్టినప్పటి నుండి ముఖ్యంగా బిజెపి అధిష్టానం సీనియర్ నాయకులను గుర్తించి వారికి కొన్ని కీలకమైన పదవులు ఇవ్వడం ప్రారంభించింది. దానిలో భాగంగా బద్వేల్ వాసి అయిన కొలిశెట్టి రమణయ్య ను పార్టీ అధిష్టానం గుర్తించి కడప జిల్లా బిజెపి కార్యదర్శిగా ఎన్నిక చేసింది. ఈ విషయంపై కొలిశెట్టి రమణయ్య స్పందిస్తూ నా సుదీర్ఘ రాజకీయ జీవితంలో బిజెపి పార్టీ ఎదుగుదల కోసం పనిచేస్తూ వచ్చాను. జిల్లా కార్యదర్శిగా ప్రకటించడం వల్ల నా పైన మరింత బాధ్యత పెరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పివిఎన్ మాధవ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, ఏపీ స్టేట్ బిజెపి ఆర్గనైజింగ్ సెక్రటరీ మధుకర్ జీ, కడప జిల్లా బిజెపి అధ్యక్షుడు జంగిటి వెంకటసుబ్బారెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిజెపి అధికార ప్రతినిధి శశిభూషణ్‌రెడ్డి, పార్టీ కార్యకర్తలందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# దొరవారిసత్రం ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన జివి చౌదరి



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఫిబ్రవరి 22)

తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గం పరిధిలోని దొరవారిసత్రం పోలీసు స్టేషన్ నూతన సబ్ ఇన్‌స్పెక్టర్‌గా జివి చౌదరి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన ఎస్ఐ బదిలీ కావడంతో ఆయన స్థానంలో చౌదరి నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ మండల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా మండలంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపడతామన్నారు. ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. పోలీసులకు, ప్రజలకు మధ్య సత్సంబంధాలు ఉండాలని కోరారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ జివి చౌదరికి పోలీస్ సిబ్బంది, స్థానిక నేతలు శుభాకాంక్షలు తెలిపారు.

---

# భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి పోలేరమ్మ తల్లి పోలేరమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి నూతన కమిటీ కృషి చేయాలి


### కూటమి ప్రభుత్వంలో దేవాలయాల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు

### మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

(షణ్ముఖ వెలుగు, కొండపి, ఫిబ్రవరి 22)



భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పోలేరమ్మ తల్లి అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. ఆదివారం ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం కామేపల్లిలో పోలేరమ్మ తల్లి దేవస్థానం నూతన కమిటీ చైర్మన్, సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యతో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ మాట్లాడుతూ భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పోలేరమ్మ తల్లి, ఈ ఆలయానికి జిల్లాలోని అనేక ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకునేందుకు వస్తుంటారు. నూతన ఆలయ కమిటీ దేవాలయ అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేయాలి. భక్తుల సౌకర్యం కోసం దేవాలయం బయట మరుగుదొడ్ల నిర్మాణంతో పాటు, కల్యాణ మండపం నిర్మాణానికి చర్యలు చేపడతాం. కూటమి పాలనలో హిందూ దేవాలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారు. వైసిపి హయాంలో దేవాలయాల ప్రతిష్టను మంట గలిపి హిందువుల మనోభావాలు దెబ్బతీశారు. కాసుల కక్కుర్తితో తిరుమల శ్రీవారి ప్రసాదంలో కృత్రిమ నెయ్యి వాడి మహాపచారం చేశారు. ప్రసాదంలో కల్తీ జరిగిందని ఓవైపు నాడు టిటిడి చైర్మన్‌గా పనిచేసిన వైవీ సుబ్బారెడ్డి ఒప్పుకున్నారు, కానీ జగన్ మాత్రం కల్తీ జరగలేదని బుకాయిస్తున్నారు. సిట్ నివేదికను సైతం వక్రీకరిస్తున్నారు. వైసిపి తీరును వెంకటేశ్వర స్వామి గమనిస్తున్నాడు, ఆయనే తగిన విధంగా వారిని శిక్షిస్తాడని మంత్రి స్వామి అన్నారు.





---

# అనారోగ్యంతో బాధపడుతున్న వారిని ఎవరు కూడా పిజిఆర్ఎస్ కు తీసుకురాకండి

### పిజిఆర్ఎస్‌కు ద్విచక్ర వాహనాల పై వచ్చే వారు తప్పని సరిగా హెల్మెట్ పెట్టుకొని రావాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్

(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 22)



నడవలేని, మంచాలకు పరిమితం అయ్య, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని ఎవరు కూడా పిజిఆర్ఎస్‌కు తీసుకురావద్దని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించే పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజలు సమస్యల అర్జీలను ఉదయం 10 గంటల నుండి 1 గంట వరకు అర్జీదారుల నుంచి అర్జీలను స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. పిజిఆర్ఎస్‌లో సమస్యల అర్జీలు అందజేసే అందుకు అనారోగ్యంతో బాధపడుతున్న నడవలేని వారిని, మంచాలకు కు పరిమిత అయ్యని వారిని ఎవ్వరూ కూడా పిజిఆర్ఎస్‌కు తీసుకురావద్దని, అలాంటి వారికి సంబంధించిన సమస్యలు ఉంటే వారి తరుపున వారు వచ్చి అర్జీలనుఅందజేయవచ్చునన్నారు.

జిల్లాలోని వివిధ మండలాల నుంచి జిల్లా కలెక్టరేట్ కు పిజిఆర్ ఎస్ లో సమస్యల అర్జీలు అందజేయాడానికి ద్విచక్ర వాహనంపై వచ్చే వారు తప్పని సరిగా హెల్మెట్ పెట్టుకొని రావాలన్నారు. జిల్లా కలెక్టరేట్‌తో పాటుగా ప్రతి రెవెన్యూ డివిజన్‌లో, మండల తహశీల్దార్ల కార్యాలయాలలోను తహశీల్దార్లు, ఎంపీడిఓలు ప్రజల నుంచి సమస్యల అర్జీలను స్వీకరించడం జరుగుతుందని తెలిపారు.

---

# జ్ఞాన సమృద్ధి పెంపొందించడమే ధనిక్ భారత్ లక్ష్యం



(షణ్ముఖ వెలుగు, గోపవరం, ఫిబ్రవరి 22)

బద్వేల్ పట్టణంలోని ఫాతిమా ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 8, 9, 10వ తరగతి విద్యార్థుల కోసం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రత్నం, సృజన్ పాఠశాలల విద్యార్థులు కూడా పాల్గొన్నారు. సదస్సుకు 'ధనిక్ భారత్' విద్యాసంస్థల డైరెక్టర్ బాలలత ఐఏఎస్, డైరెక్టర్ విక్రమ్ అజయ్ బాబు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. దేశాభివృద్ధిలో విద్య ప్రధాన పాత్ర పోషిస్తుందని, జ్ఞాన సమృద్ధితో కూడిన సమాజ నిర్మాణమే తమ లక్ష్యమని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఇంటర్మీడియట్ విద్యను మరింత బలోపేతం చేయడానికి తమ సంస్థ కృషి చేస్తుందని వెల్లడించారు. 'ధనిక్ భారత్' అనేది కేవలం ఆర్థిక అభివృద్ధి మాత్రమే కాకుండా, విలువలతో కూడిన విద్య, సాంకేతిక నైపుణ్యాలు, సమగ్ర వ్యక్తిత్వ వికాసం, బాధ్యతాయుత పౌరుల తయారీని లక్ష్యంగా పెటుకున్నదని స్పష్టం చేశారు. విద్యార్థి కేంద్రిత బోధన విధానాలతో భవిష్యత్ నాయకులను తీర్చిదిద్దడమే తమ సంకల్పమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ధనిక్ భారత్ చైర్మన్లు కందిమల్ల సాంబశివరావు, సలీం, రత్నం ఇంగ్లీష్ మీడియం స్కూల్ డైరెక్టర్ తలారి రత్నం, సుజన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ శ్రీనివాసులు రెడ్డి, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ



(షణ్ముఖ వెలుగు, బద్వేల్, ఫిబ్రవరి 22)

బద్వేల్ నియోజకవర్గంలో ప్రజలకు అండగా నిలుస్తూ, అత్యవసర వైద్య సహాయం అవసరమైన పలువురు లబ్ధిదారులకు మాజీ శాసనసభ్యురాలు విజయమ్మ ఆదివారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. మొత్తం రూ.25,88,098 విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా విజయమ్మ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ పథకం ద్వారా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న అనేక కుటుంబాలకు ప్రాణాధారమైన సహాయం అందుతోందని తెలిపారు. ముఖ్యంగా ఖరీదైన వైద్య చికిత్సలు అవసరమైన సమయంలో ఈ సహాయనిధి లబ్ధిదారులకు ఊరట కలిగిస్తోందని, బద్వేల్ నియోజకవర్గంలోనూ ఈ పథకం ద్వారా ఎంతో మంది ప్రయోజనం పొందడం ఆనందకరమని హర్షం వ్యక్తం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వం ప్రజలకు అండగా ఉంటుందనే నమ్మకాన్ని ఈ సహాయనిధి మరింత బలపరుస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు చేరేలా కృషి కొనసాగుతుందని ఆమె స్పష్టం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారంలో తాము ఎప్పటికీ ముందుండి సేవలందిస్తామని తెలిపారు.

# కన్నెగంటి హనుమంతుకు ఘన నివాళులు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 22)

పల్నాడు వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు అమరవీరుడు కన్నెగంటి హనుమంతు 104వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. బ్రిటిష్ పాలనలో అమలు చేసిన అన్యాయ పన్నుల విధానానికి వ్యతిరేకంగా హనుమంతు గారు ప్రజలను సమీకరించి పోరాటం నడిపారు. 22 ఫిబ్రవరి 1922న బ్రిటిష్ సైన్యం కాల్పుల్లో వీరమరణం పొందిన తొలి తెలుగు విప్లవకారుడు, ఆయన త్యాగం చరిత్రలో చిరస్థాయిగా నిలిచింది. ఈ సందర్భంగా ఉమ్మడి ప్రకాశం జిల్లా కన్నెగంటి హనుమంతు స్పోర్ట్స్ సొసైటీ అధ్యక్షులు దాసరి పిచ్చయ్య నాయుడు మాట్లాడుతూ "అమరవీరుడు కన్నెగంటి హనుమంతు వీరగాథను పాఠ్యపుస్తకాలలో చేర్చాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాము" అని పేర్కొన్నారు. యువతలో దేశభక్తి, స్వాభిమానం, అన్యాయానికి ఎదురు నిలిచే ధైర్యం పెంపొందించేందుకు ఆయన జీవితం ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షులు దాసరి పిచ్చయ్య నాయుడు, పొగుల మల్లికార్జునరావు, ఇందుర్తి ప్రసాద్ (డుంబు), చంగలశెట్టి సుధాకర్, గారా నారాయణరావు, బండారు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అమరవీరుడు కన్నెగంటి హనుమంతు సేవలను స్మరించుకుంటూ ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు.

# గోవా పర్యాటక విధానం బాపట్లకు ఆదర్శం

## గోవా సీఎంను కలిసిన కలెక్టర్ బృందం





(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 22)
జిల్లాలో తీర ప్రాంత పర్యాటక రంగ అభివృద్ధి లక్ష్యంగా మూడు రోజుల పాటు గోవా రాష్ట్రంలో అధ్యయన పర్యటన చేపట్టిన జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ బృందం శనివారం పర్యటనను ముగించింది. ఈ సందర్భంగా బృందం గోవా ముఖ్యమంత్రి డాక్టర్ ప్రమోద్ సావంత్ ను మర్యాదపూర్వకంగా కలిసింది. దేశంలో గోవాను ప్రముఖ పర్యాటక రాష్ట్రంగా తీర్చిదిద్దిన విధానంపై కలెక్టర్ బృందం హర్షం వ్యక్తం చేసింది. పర్యటన సందర్భంగా అక్కడి అధికారులు అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున గోవా ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి శాలువా కప్పి సత్కరించి, శ్రీ వెంకటేశ్వర స్వామి విగ్రహాన్ని జ్ఞాపికగా అందజేశారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ రూపొందించిన కాఫీ టేబుల్ పుస్తకాన్ని ముఖ్యమంత్రికి అందజేయగా, గోవా పర్యాటక విధాన పుస్తకాన్ని ముఖ్యమంత్రి కలెక్టర్ బృందానికి అందించారు. సముద్ర తీర ప్రాంతాల అభివృద్ధిలో తీర ప్రాంత నియంత్రణ మండలి నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ముఖ్యమంత్రి సూచించారు. నిబంధనలకు లోబడి నిర్మాణాలు చేపట్టడం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని, భవిష్యత్తులో న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తవని పేర్కొన్నారు. గోవా పర్యటనలో పొందిన అనుభవాలను బాపట్ల తీర ప్రాంత అభివృద్ధిలో అమలు చేస్తామని కలెక్టర్ బృందం వెల్లడించింది. ఈ పర్యటనలో మున్సిపల్ కమిషనర్ జి. రఘునాథ రెడ్డి, తహసీల్దార్ కె. గోపికృష్ణ, ఎంపీడీవో ఎం. రాజేష్ బాబు, జిల్లా పర్యాటక అధికారి అలీ అస్గర్ షేక్, ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ ప్రాజెక్టు మేనేజర్లు శివ శరణ్, షేక్ సజిత్ పాల్గొన్నారు.



# స్వభ్యత్వం పై దృష్టి పెట్టాలి

## జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇమ్మడి కాశీనాథ్





(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, ఫిబ్రవరి 22)
సభ్యత్వం పై జనసైనికులు ప్రతి ఒక్కరూ దృష్టి పెట్టాలని మార్కాపురం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి ఇమ్మడి కాశీనాథ్ కోరారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ముఖ్య నాయకులతో ఆయన మాట్లాడారు. జనసేన పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ చేపట్టిన జనసేన పార్టీ ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 26 నుంచి ప్రారంభం కానుందన్నారు. జనసేన పార్టీ నాయకులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, అలాగే పవన కళ్యాణ్ ఆలోచనా విధానం గురించి తెలియజేసి, అలాగే గత మూడు సంవత్సరాలుగా మార్కాపురం నియోజకవర్గం నుండి చేపట్టిన సభ్యత్వాల కంటే అధికం సంఖ్యలో సభ్యత్వాలు చేసే విధంగా పని చేయాలని జనసేన నాయకులకు నిర్దేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి ఎన్‌వి సురేష్, శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి దేవస్థాన కమిటీ ధర్మకర్తలు విజయరావు నరసింహారావు, మండ్ల వెంకటయ్య, జిల్లా లీగల్ సెల్ జాయింట్ సెక్రటరీ ఐ శైలజ, మార్కాపురం ఏఎంసీ డైరెక్టర్ పూజా లక్ష్మీ, జనసేన నాయకులు పిన్నెబోయిన శ్రీనివాసులు, ఎంఎన్ రెడ్డి, కంభం వెంకట రమణ, ఉమ్మడి రవీంద్ర, బెల్లంకొండ రామకృష్ణ, షేక్ ఖాసిం వలి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అత్యంత వైభవంగా వీరరాఘవుల ప్రమాణ స్వీకార మహోత్సవం





(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఫిబ్రవరి 22)
ఆదివారం బాపట్ల పట్టణంలో నిర్వహించిన జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యవర్గ సభ్యుల ప్రమాణస్వీకారంలో భాగంగా జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని కడవకుదురు గ్రామనికి చెందిన నక్కల వీరరాఘవుల పదవి భాద్యత స్వీకారం అమోఘంగా జరిగింది. పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి అదేశాలతో చిన్నగంజాం మండలం మరియు  పర్చూరు నాయకులు, కార్యకర్తలు వేలాది మంది తరలివచ్చి రాఘవకు మద్దతు ఇచ్చారు. సమావేశంలో రాఘవులు ప్రమాణం చేసే సమయంలో కార్యకర్తలు స్పందించిన తీరు అద్భుతంగా నీలిచింది.ఎమ్మెల్యే ఏలూరి చోరవతో రాఘవకు దక్కిన ఇ కార్యదర్శి పదవికీ న్యాయం జరుగుతందని కార్యకర్తలు సంతోషం చూస్తే తెలుసోంది.

**ఎమ్మెల్యే ఏలూరి కృషితో....**

మొదటి నుండి ఏలూరి అనుచరుడిగా గుర్తింపుతో జిల్లాలో రాఘవకు  కీలక పదవి రావటంతో మండల ప్రజలు అనందం వ్యక్తం చేసున్నారు. నిజమైన కార్యకర్తకు పార్టీలో న్యాయం జరుగుతుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# ఇంటర్ పరీక్షలు రాసే ప్రతి విద్యార్థులకు ఆల్ ది బెస్ట్





**సిఐ రాజేష్ కుమార్, ఎస్ఐ సూరెడ్డి రాజేష్**

**23 నుండి ఇంటర్మీడియట్ పరీక్షలు**

**పరీక్షా కేంద్రాలను సందర్శించిన సిఐ రాజేష్ కుమార్**

**నిమిషం నిబంధన అమలులో ఉన్నందున, ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించరు**

**విద్యార్థులు పరీక్షా సమయానికి**

**కనీసం 30 నిమిషాల ముందే కేంద్రానికి చేరుకోవాలి**

(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఫిబ్రవరి 22)
ఇంటర్మీడియట్ పరీక్షలు రాసే ప్రతి విద్యార్థికి ఆల్ ది బెస్ట్ తెలిపారు పొదిలి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రాజేష్‌కుమార్, ఎస్ఐ సూరెడ్డి రాజేష్‌లు. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను ఆదివారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది పలు సలహాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిమిషం నిబంధన అమలులో ఉన్నందున ఒక నిమిషం ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించేది లేదని స్పష్టం చేశారు. కనీసం 30 నిమిషాలు ముందుగానే పరీక్షే కేంద్రానికి చేరుకోవాలన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఇంటి నుండి ముందే బయలుదేరడం మంచిదన్నారు. పొదిలి ఎస్ఐ రాజేష్ ఆధ్వర్యంలో పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లు పరీక్షా సమయంలో మూసి వేయాలన్నారు. లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎండ తీవ్రత దృష్ట్యా ప్రతి కేంద్రం వద్ద చల్లని తాగునీరు అందుబాటులో ఉంచాలని తెలిపారు. గదుల్లో ఫ్యాన్లు, వెలుతురు, మెడికల్ కిట్లు సిద్ధంగా ఉంచాలన్నారు. పరీక్షా కేంద్రాల నిర్వహకులు, సిబ్బందికి కీలక సూచనలు చేశామన్నారు. పరీక్షలు అత్యంత పారదర్శకంగా, ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపట్టామన్నారు. విద్యార్థులు నిర్భయంగా, ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ధైర్యం చెప్పారు.


# పోలేరమ్మ తల్లికి పూజలు చేసిన ఎమ్మెల్యే కందుల



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, ఫిబ్రవరి 22)
ఉగాది ఉత్సవాలను పురస్కరించుకొని మార్కాపురం శివారులో వెలసిన శ్రీ అల్లూరి పోలేరమ్మ అమ్మవారిని దర్శించుకొన్న మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. మార్కాపురంలో ఉగాది ఉత్సవాలు శ్రీ అల్లూరి పోలేరమ్మ దేవి  ఆలయంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉగాది ఉత్సవంలో భాగంగా మొదటి ఆదివారం అమ్మవారు త్రిమూర్తి స్వరూపిణి, గ్రామరక్షకి గా భక్తులకు దర్శనమిచ్చారు. పక్కనే ఉన్న శ్రీ కళ్యాణ నాగమయ్య స్వామి ఆదివారం శాంతి నాగేంద్ర స్వామి వారిగా దర్శనమిస్తున్నారు. కళ్యాణ నాగమయ్యలకు, నాగశిలాల అమ్మవార్లని దర్శించుకోవడానికి తెల్లవారుజాము నుండి క్యూలైన్లలో  అధిక సంఖ్యలో భక్తులు బారులు తీరారు. అనంతరం మార్కాపురం ఏఎంసి చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి శ్రీ అల్లూరు పోలేరమ్మ తల్లి మొక్కు తీర్చుకొనుటకు బండి కట్టిన నేపథ్యంలో మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి బండికి కొబ్బరికాయ కొట్టి  అనంతరం శ్రీ అల్లూరు పోలేరమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.







On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com